# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 8-4-2023 RNI No.52865/93·Postal No.HQ/SD/258/2021-2023 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :29 సంచిక: 184 పేజీలు:6 వెల: రూ.1/-


## కోవిడ్ కేసులు పెరుగుతున్న దృష్ట్యా రాష్ట్రాలు అప్రమత్తంగా ఉండాలి:కేంద్రం

న్యూఢిల్లీ ఏప్రిల్ 7 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); : కేంద్ర ఆరోగ్య శాఖమంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవియాకోవిడ్ కేసులు, నిర్వహణ చర్యలపై వివిధ రాష్ట్రాల ఆరోగ్య శాఖ మంత్రులు), ప్రిన్సిపల్ సెక్రటరీలతో ఆన్‌లైన్ నిర్వహించారు. దేశంలో కోవిడ్ కేసులు పెరుగుతున్న దృష్ట్యా రాష్ట్రాలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

కరోనా కేసులు పెరగకుండా అడ్డుకునేందుకు తగిన చర్యలు చేపట్టాలని కోరారు. ఇందులో భాగంగా ఏప్రిల్ 10, 11 తేదీల్లో అన్ని హాస్పిటల్స్‌లో సన్నాహక చర్యలు చేపట్టాలని కోరారు. ఈ నెల8,9 తేదీల్లో జిల్లా ఉన్నతాధికారులు, ఆరోగ్యశాఖ అధికారులతో కోవిడ్ చర్యలపై సమీక్షించాలని ఆరోగ్య మంత్రులను కోరారు.


## ఎలక్ట్రిక్ బస్సులో చెలరేగిన మంటలు.. తప్పిన ప్రమాదం

హైదరాబాద్, ఏప్రిల్ 7:హైదరాబాద్‌లోని బేగంపేటలో శుక్రవారం ఉదయం అగ్నిప్రమాదం సంభవించింది. వేగంగా వెళ్తున్న ఎలక్ట్రిక్ బస్సులో ఆకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన డ్రైవర్.. బస్సును ఆపేశారు. సమాచారం అందుకున్న బేగంపేట పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. టీఎస్ ఆర్టీసీకి చెందిన ఎలక్ట్రిక్ బస్సు బేగంపేట నుంచి ప్యారడైస్ వైపు వెళ్తుండగా ఉదయం 9 గంటలకు ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదని స్పష్టం చేశారు. అగ్నికీలలు ఎగిసిపడిన వెంటనే బస్సు ఆపడంతో ప్రయాణికులందరూ బస్సు దిగేశారని పేర్కొన్నారు. బస్సు ముందు భాగం స్వల్పంగా కాలిపోయింది. షార్ట్ సర్క్యూట్ కారణంగానే అగ్నిప్రమాదం జరిగినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది.

## అనంతపురం ఆర్టీవో కార్యాలయం వద్ద పేలుడు –పేలుడు ధాటికి అపార్టుమెంట్ వాచ్‌మెన్ సతీష్ అక్కడికక్కడే మృతి

అనంతపురం ఏప్రిల్ 7 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: ఆర్టీవో కార్యాలయం వద్ద పేలుడు జరిగింది. కెమికల్ డబ్బా ఓపెన్ చేస్తుండగా భారీ ప్రమాదం చోటు చేసుకుంది. పేలుడు ధాటికి అపార్టుమెంట్ వాచ్‌మెన్ సతీష్ అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన ప్రదేశానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ పేలుడుతో అనంతపురం నగరం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. అనంతపురం ఆర్టీవో కార్యాలయం సమీపంలో శ్రీ బాలాజీ స్టిక్కర్స్ స్ప్రే పెయింట్స్ షాపు ఉంది. ఇక్కడ గత 9 రోజులుగా గోడౌన్ ఏర్పాటు చేసుకుని స్ప్రే అమ్మకాలతో పాటు పేయింట్‌కు సంబంధించిన కార్యకలాపాలు కూడా చేస్తున్నారు. అయితే కొన్ని రోజులుగా వాడని పేయింట్ డబ్బాలు ఉన్నాయి. వాటిని సమీపంలో ఉన్న అపార్టుమెంట్ వాచ్‌మెన్‌కు అమ్ముకోమని షాపు యజమాని చెప్పారు. దీంతో శుక్రవారం మధ్యాహ్నం పెయింట్ డబ్బాలు తెరుస్తుండగా ఒక్కసారిగా పేలుడు జరిగినట్లు స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో వాచ్‌మెన్ సతీష్ శరీరం తునాతునకలైంది. దీంతో అక్కడ భయానక వాతావరణం ఏర్పడింది. షాపు యజమానిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పూర్తి సమాచారం అందవలసి ఉంది.

## ముగిసిన సలేశ్వరం జాతర..చివరి రోజు లక్ష మంది భక్తుల రాక



అచ్చంపేట, ఏప్రిల్ 7: చైత్రపౌర్ణమి సందర్భంగా నాగర్‌కర్నూలు జిల్లాలోని సలేశ్వరం జాతర చివరి రోజు శుక్రవారం శివనామస్మరణతో మారుమ్రోగింది. తెలంగాణ అమరనాథ్ యాత్రగా పేరొందిన సలేశ్వరం జాతర శుక్రవారం సాయంత్రంతో ముగిసింది. సాయంత్రం 5 గంటల వరకే భక్తులను లోపలికి అనుమతించారు. వీరంతా స్వామి దర్శనం అనంతరం శనివారం తెల్లవారుజామున తిరిగి రానున్నారు.

దట్టమైన అటవీ ప్రాంతంలోని కొండా కోనల్లో వెలిసిన లింగమయ్యను దర్శించుకునేందుకు మూడురోజులల పాటు సుమారు 6 వేలకుపైగా వాహనాల్లో 4 లక్షల వరకు భక్తులు దర్శనానికి తరలివచ్చారు. చివరి రోజు సుమారు లక్ష మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. తెలంగాణ, ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర, ఇతర ప్రాంతాల నుంచి ప్రత్యేక వాహనాలు, మోటార్‌సైకిళ్లు, బస్సుల్లో భక్తులు తరలివచ్చారు.

భక్తులు కాలినడకన కొండలు, వంకలు ఎక్కుతూ..దిగుతూ.. రాళ్లూరప్పలను దాటుకుంటూ లోతట్టు లోయలోని స్వామివారిని దర్శించుకున్నారు. లోయలో గుండం వద్ద ప్రమాదకర దారి మీదుగా చిన్నా, పెద్ద, వృద్ధులు సైతం లింగబేధం లేకుండా స్వామి సన్నిధికి చేరి మొక్కులు చెల్లించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

## అంధుల కోసం ఏఐ టెక్నాలజీతో స్మార్ట్ విజన్ గ్లాసెస్ లాంఛ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7: దృష్టి లోపాలతో బాధపడేవారితో పాటు అంధుల్లో కొత్త ఆశలు చిగురించేలా ఏఐ, మెషిన్ లెర్నింగ్ టెక్నాలజీతో స్మార్ట్ విజన్ గ్లాస్‌లను ఓ ప్రైవేట్ ఆస్పత్రి లాంఛ్ చేసింది. ఈ విజన్ గ్లాస్‌లు తేలికగా ఉండటంతో పాటు యూజర్లకు సహకరించేలా కెమెరా, సెన్సర్ ఫీచర్లు సహా ఏఐఎంఎల్ టెక్నాలజీని కలిగిఉంటాయి. ఈ గ్లాస్‌లు ఇమేజ్‌లను ప్రొజెక్ట్ చేయడం, నడిచేందుకు సహకరించడం, ఫేస్ రికగ్రేషన్ సామర్ధ్యాలను కలిగిఉంటాయి. చదివి, అర్ధం చేసుకోగల స్మార్ట్ ఇయర్‌పీస్ కూడా వీటితో పాటు యూజర్లకు అందిస్తారు. వాయిస్ అసిస్టెన్స్, జీపీఎస్ నావిగేషన్ వంటి అదనపు ఫీచర్లు యూజర్లకు నడిచే క్రమంలో ఏవైనా అడ్డంకులు ఎదురైతే ఇవి అప్రమత్తం చేస్తాయి. విజన్ ఎయిడ్ ఇండియా, స్టార్టప్ ఎస్‌హెచ్‌జీ టెక్నాలజీస్ సహకారంతో ఈ వేరబుల్ డివైజ్‌ను డాక్టర్ ష్రాఫ్స్ చారిటీ ఐ హాస్పిటల్ ఇటీవల లాంఛ్ చేసింది. దేశం నుంచి అంధత్వాన్ని నివారించే క్రమంలో తాము ఈ ప్రొడక్ట్‌తో ముందుకొచ్చామని హాస్పిటల్ ఈడీ, సీఈవో ఉమాంగ్ మాధుర్ చెప్పుకొచ్చారు.


## జనం నమ్మట్లేదనే ఏపీ సీఎం జగన్ మారీచ జిత్తులు: యనమల

అమరావతి ఏప్రిల్ 7 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: జనం నమ్మట్లేదనే ఏపీ సీఎం జగన్ మారీచ జిత్తులు మళ్లీ ప్రారంభించారని మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు విమర్శించారు. దేశంలోనే ఇంత ఫెయిల్యూర్ సీఎం ఎక్కడా లేడన్నారు. సొంత పార్టీలోనే అంతర్గత తిరుగుబాట్లతో దిక్కుతోచని స్థితి ఏర్పడిందన్నారు. పంజాబ్‌లా మారిందనే ప్రధాని మోదీ వ్యాఖ్యలే నిదర్శనమన్నారు. రామ రాజ్యం కన్నా రాక్షస రాజ్యంపైనే జగన్‌కు మోజెక్కువన్నారు. అందుకే ఒంటిమిట్ట రాములోరి కల్యాణానికి ఎగ్గొట్టాడని యనమల పత్రికా ప్రకటనలో యనమల రామకృష్ణుడు పేర్కొన్నారు.

### నేటి కందం- నేటికి అందం

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

కం॥ జంతు ప్రదర్శనశాలల
నింపగ ప్రేమించు వారి కుప్పలుచయమున్
చింతన లసెల్ల నశయుచు
కంతుని జనకుండొసంగు కాయిత శతముల్॥




(ఏప్రిల్ 8 ప్రపంచ జంతు ప్రదర్శనశాలల ప్రేమికుల రోజు...))

-రాధశ్రీ
సెల్:9494481210

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

## ప్రభుత్వానికి చెందిన ఒక్క గింజ వదలం.. ఒక్క రూపాయి పోనివ్వం : మంత్రి గంగుల కమలాకర్



హైదరాబాద్, ఏప్రిల్ 7: ప్రభుత్వం మిల్లర్లకు కేటాయించిన ధాన్యంలో ఒక్క గింజను వదులుకోమని, ఒక్క రూపాయిని పోనివ్వమని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో మంత్రి గంగుల కమలాకర్ ఈ అంశంపై సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. అక్రమాలు చేస్తున్న, డిఫాల్ట్ మిల్లర్లు అధికంగా ఉన్న సూర్యాపేట, నల్గొండ, వనపర్తి, మెదక్, నిజామాబాద్, కామారెడ్డి, కరీంనగర్, సిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల్లో పటిష్టమైన టాస్క్‌ఫోర్స్‌ను తక్షణమే ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. మిగతా అన్ని జిల్లాల్లోనూ రిటైర్డ్ పోలీస్, రెవెన్యూ ఉన్నతాధికారులతో కట్టుదిట్టమైన టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తామన్నారు. ధాన్యం అమ్ముకునే మిల్లర్లను, రేషన్ బియ్యం పక్కదారి పట్టడాన్ని గుర్తించి సమాచారం అందించిన పౌరులకు సైతం రివార్డులు అందజేయడంతో పాటు వారి వివరాల్ని గోప్యంగా ఉంచుతామని మంత్రి తెలిపారు.

141 లక్షల మెట్రిక్ టన్నులకు పెరిగిన ధాన్యం సేకరణ

తెలంగాణ ఏర్పాటు తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ కృషితో ధాన్యం సేకరణ 24 లక్షల మెట్రిక్ టన్నుల నుండి 141 లక్షల మెట్రిక్ టన్నులకు పెరిగిందని మంత్రి తెలిపారు. ఈ ధాన్యం సేకరణకు అనుగుణంగా మిల్లింగ్ కెపాసిటీ పెరగలేదని, కేవలం గతానికి ఇప్పటికి 2 రెట్లు మాత్రమే పెరిగిందన్నారు. అందువల్ల మిల్లర్లకు అధనంగా ధాన్యం కేటాయింపులు చేయడం జరుగుతుందని, ఇదే అదనుగా భావించి కొన్ని చోట్ల మిల్లర్లు అనైతిక చర్యలకు పాల్పడుతూ ప్రభుత్వం ఇచ్చిన దాన్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని మంత్రి పేర్కొన్నారు. అలాంటి వారిపై క్రిమినల్ కేసులతో పాటు రెవెన్యూ రికవరీ యాక్ట్‌ను ప్రయోగించి 125 శాతం క్యాష్ రికవరీని సైతం వసూలు చేస్తున్నామన్నారు. డిఫాల్ట్ మిల్లర్లు, అక్రమార్కులను ఉపేక్షించేది లేదని ఈ విషయంలో ఎలాంటి పక్షపాతం లేదని స్పష్టం చేశారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా మిల్లర్ల నుండి 90 శాతం రికవరీ చేశామని, మిగతా పది శాతం సైతం వీలైనంత త్వరగా రికవరీ చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందుకోసం క్షేత్రస్థాయి పౌరసరఫరాల యంత్రాంగంతో పాటు కలెక్టర్లు ప్రత్యేకంగా దృష్టి సారించి నిరంతరం పర్యవేక్షణ చేస్తూ రికవరీలో వేగం సాధిస్తున్నారన్నారు.

రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా పటిష్టమైన చర్యలు

ఈ యాసంగి సీజన్లోనూ రైతులకు ఇబ్బందులు లేకుండా, మిల్లర్లపై ఒత్తిడి కలగకుండా ఇంటర్మీడియట్ గోదాములను సైతం ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని మంత్రి దయాకర్ రావు తెలిపారు. వీటితో పాటు మన సరిహద్దు రాష్ట్రాలైన కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న మిల్లింగ్ కెపాసిటీని వాడుకునేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అలాగే గత డిఫాల్టర్లకు, అక్రమ మిల్లర్లకు ఒక్క గింజను కూడా కేటాయించబోమన్న మంత్రి, సక్రమంగా సకాలంలో మిల్లింగ్ చేస్తున్న వాటికి మద్దతినస్తానే ఇంతవరకూ సీఎంఆర్‌లో పాల్గొనని మిల్లర్లను సైతం ప్రోత్సహించి వారికి ధాన్యం కేటాయింపులు చేసి సకాలంలో మిల్లింగ్ కోసం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎట్టిపరిస్థితుల్లోనూ సకాలంలో సీఎంఆర్ పూర్తి చేయడం, రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటామన్నారు మంత్రి గంగుల కమలాకర్.

## 14న అంబేద్కర్ విగ్రహావిష్కరణకు తరలిరావాలి : మంత్రి తలసాని పిలుపు



హైదరాబాద్, ఏప్రిల్ 7:దేశంలోనే అతి పెద్ద 125 అడుగులతో నిర్మించిన రాజ్యాంగ నిర్మాణ అంబేద్కర్ విగ్రహావిష్కరణకు బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం

తెలంగాణ భవన్ లో హైదరాబాద్ జిల్లా బీఆర్ఎస్(ఃఖీూ )ముఖ్యుల సమావేశంలో మంత్రి మాట్లాడారు.

భారత దేశం గర్వపడే విధంగా అంబేద్కర్ విగ్రహాన్ని నిర్మించిన గొప్ప మానవతావాది సీఎం కేసీఆర్(అఓ ఐఅఖీ) అని ప్రశంసించారు. విగ్రహావిష్కరణ రోజున హైదరాబాద్ జంట నగరాల్లోని 15 నియోజకవర్గాల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు ర్యాలీగా బయలుదేరి సభాస్థలికి చేరుకుంటారని ఆయన వెల్లడించారు.

బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాలు హైదరాబాద్ సిటీలో ఉత్సహంగా జరుగుతున్నాయని తెలిపారు. మరో 10,15 రోజుల్లో సమ్మేళనాలు పూర్తవుతాయని , 25వ తేదీన రాష్ట్రస్థాయి సమావేశం జరుగుతుందని తెలిపారు.

ఆత్మీయ సమ్మేళనంలో 2014 కంటే ముందు, తరువాత జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై కులంకషంగా చర్చ జరిగిందన్నారు. ఈ సమావేశంలో హోంమంత్రి మహమూద్ అలీ, జిల్లా అధ్యక్షుడు మాగంటి గోపీనాథ్, ఇన్‌చార్జి దాసోజు శ్రవణ్, మేయర్ విజయలక్ష్మి, ఎమ్మెల్సీ ప్రభాకర్ రావు, ఎమ్మెల్యే లు ముఠా గోపాల్, కాలేరు వెంకటేష్, కార్పొరేషన్ చైర్మన్ లు గజ్జల నగేష్, విప్లవ్ కుమార్, రావుల శ్రీధర్ రెడ్డి, డిప్యూటీ మేయర్ శ్రీలత, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి తలసాని సాయి కిరణ్ యాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రసన్న, వివిధ నియోజకవర్గాల ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

## అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్ బండి సంజయ్: ప్రభుత్వ విప్ బాల్క సుమన్

హైదరాబాద్, ఏప్రిల్ 7: సింగరేణి బొగ్గు గనులు వేలానికి పెట్టడం దుర్మార్గమని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అన్నారు. మోదీ దోస్త్ అదానీకి సింగరేణిని కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. లాభాల్లో నడుస్తున్న సంస్థను నిర్వీర్యం చేయొద్దని డిమాండ్ చేశారు. సింగరేణి విషయంలో బండి సంజయ్ అబద్ధాలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే బాల్క సుమన్ మీడియాతో మాట్లాడారు. ఇప్పటికే మూడుసార్లు వేలం ప్రకటన ఇచ్చినా ఎవరూ ముందుకు రాలేదన్నారు. మళ్లీ నాలుగోసారి 4 బొగ్గు గనుల వేలానికి ప్రకటన ఇచ్చారని చెప్పారు. సింగరేణిని ప్రైవేటీకరించడం లేదని బీజేపీ నేతలు సిగ్గు లేకుండా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు.

సింగరేణిని ప్రైవేటీకరించవద్దని ప్రధాని మోదీకి సీఎం కేసీఆర్ లేఖ రాశారని గుర్తుచేశారు. బండి సంజయ్ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. సింగరేణిని ప్రైవేటీకరించకపోతే బొగ్గు గనులను సంస్థకు ఎందుకు కేటాయించడం లేదని ప్రశ్నించారు. బీజేపీ నేతలు చెప్పిన మాటమీద నిలబడటం లేదని విమర్శించారు. లాభాల్లో నడుస్తున్న సంస్థకు గనులు కేటాయించాలన్నారు. సింగరేణిని అదానీకి అప్పజెప్పడానికి కుట్ర జరుగుతున్నదని ఆరోపించారు. రాబోయే రోజుల్లో బీజేపీ నేతలను సింగరేణి ప్రాంతాల్లో తిరుగనివ్వరని హెచ్చరించారు.

పేపర్ లీకేజీల వ్యవహారం వెనుక కేంద్రం పెద్దల హస్తం ఉందని బాల్క సుమన్ ఆరోపించారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న ఎవరీ వదలొద్దని ప్రభుత్వాన్ని కోరారు. అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్ బండి సంజయ్ అని విమర్శించారు. బీజేపీ పట్ల తెలంగాణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. బీజేపీ తెలంగాణ వ్యతిరేక పార్టీ అని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆ పార్టీ విధానాలన్నీ తెలంగాణకు వ్యతిరేకంగా ఉన్నాయని చెప్పారు.

## తెలంగాణకు మరో 5 జాతీయ అవార్డులు.. 17న రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డుల అందజేత

హైదరాబాద్, ఏప్రిల్ 7: తెలంగాణకు మరో 5 జాతీయ అవార్డులు వచ్చాయి. 8 దీన్ దయాల్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్ పురస్కారాలకు తోడుగా, తాజాగా మరో 5 నానాజీ దేశ్ ముఖ్ సర్వోత్తమ్ పంచాయత్ సతత్ వికాస్ పురస్కారాలు లభించాయి. తాజాగా కేంద్ర పంచాయతీరాజ్ శాఖ ఆర్థిక సలహాదారు బిజయ కుమార్ బెహ్రా ప్రకటించారు. దీంతో కేంద్రం ప్రకటించిన పుసర్కారాలలో మొత్తం 13 పురస్కారాలను తెలంగాణ రాష్ట్రం సాధించింది. ఏప్రిల్ 17న ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డుల అందజేస్తామని, సంబంధిత ప్రతినిధులను ఒక రోజు ముందుగా పంపించాలని ఆ లేఖలో పేర్కొన్నారు.

**తెలంగాణకు వరించిన నానాజీ దేశ్ ముఖ్ సర్వోత్తమ్ పంచాయత్ సతత్ వికాస్ పురస్కారాలు ఇవే..**

ఉత్తమ బ్లాక్ (మండల) పంచాయతీల అవార్డు విభాగంలో కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ ఎల్ఎండీ

ఉత్తమ జిల్లా పరిషత్ విభాగంలో ములుగు జిల్లా

స్పెషల్ కేటగిరీ అవార్డుల్లో? గ్రామ ఊర్జా స్వరాజ్ విశేష్ పంచాయత్ పురస్కార్ విభాగంలో ఆదిలాబాద్ జిల్లా ముఖరా కె గ్రామం

కార్బన్ న్యూట్రల్ విశేష్ పంచాయతీ పురస్కార్ విభాగంలో రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం కన్హా గ్రామం

నాన్ ఫైనాన్షియల్ ఇన్సెంటివ్ ? సర్టిఫికేట్ల విభాగం ? గ్రామ ఊర్జా స్వరాజ్ విశేష్ పంచాయత్ పురస్కారానికి సిద్దిపేట జిల్లా మార్కూక్ ఎర్రవెల్లి ఎంపికైంది.

## తెలంగాణలో బీజేపీ ఆటలు సాగవు : ఎమ్మెల్సీ యెగ్గే మల్లేశం

యాదాద్రి భువనగిరి, ఏప్రిల్ 7: బీఆర్ఎస్‌ను రాజకీయంగా ఎదుర్కొనే ధైర్యం లేక బీజేపీ నాయకులు విద్యార్థుల భవిష్యత్‌తో ఆటలాడుకుంటున్నారని ఎమ్మెల్సీ, తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు యెగ్గే మల్లేశం ఆరోపించారు. యాదగిరిగుట్ట మండలం బాహుపేటలో ఆయన మీడియాతో మాట్లాడారు. పదవ తరగతి పరీక్షా పత్రం లీకేజీ వ్యవహారంపై బీజేపీ రాజకీయాలు చేయడం తగదన్నారు. బీఆర్ఎస్ పార్టీపై కోపం ఉంటే రాజకీయంగా ఎదుర్కోవాలని అన్నారు.

జాతీయ పార్టీకి చెందిన రాష్ట్ర అధ్యక్షుడే ఇలాంటి హేయమైన చర్యకు పాల్పడడం బాధాకరమని అన్నారు. కేసీఆర్ ఉన్నంతవరకు తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ ఆటలు సాగవని వెల్లడించారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.

తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో గుజరాత్ రాష్ట్రాన్ని మించిపోవడాన్ని జీర్ణించుకోలేక కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో విధ్వంసాలు సృష్టించడానికి కుట్రపూరిత చర్యలు చేస్తుందని విమర్శించారు. ఇటువంటి కుయుక్తులను తెలంగాణ సమాజం సహించదు. క్షమించదని అన్నారు. బీజేపీ పార్టీకి తెలంగాణ ప్రజలు తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు.




# వాతావరణ మార్పుల కట్టడి భాద్యత ఎవరిదీ..!

గతంలో 'యూయన్ ఫ్రేమ్‌వర్క్ కన్వెన్షన్ ఫర్ క్లైమేట్ ఛేంజ్' సమావేశంలో ప్రపంచ దేశాలు వాతావరణ ప్రతికూల మార్పులను కట్టడి చేయడానికి తాము తీసుకోబోతున్న పలు చర్యలను రాతపూర్వకంగా స్పష్టం చేశాయి. నేడు వాతావరణ ప్రతికూల మార్పుల ఫలితంగా ప్రపంచ దేశాలు భూతాపం, వడగాలులు, అకాల వర్షాలు, విపత్తులు, తుఫానులు, సునామీలు, కరువుకాటకాలు లాంటి విధ్వంసాలను అనుభవిస్తూనే ఉండడం చూస్తున్నాం, వింటున్నాం. వాతావరణ మార్పులకు చెక్ పెట్టడానికి ప్రపంచ దేశాలన్నీ తాము వాగ్దానం చేసిన విధంగా చర్యలను వేగిరపరచడం తక్షణావసరంగా తోస్తున్నది. దీనికి ఆయా దేశాలు స్వచ్ఛందంగా చొరవ చూపాల్సిన అవసరం ఉన్నది.

ఐరాస తీసుకున్న తాజా తీర్మానం:

దేశాలు చేసిన వాగ్దానాలను పాటించని యెడల ఆయా దేశాలపై ఏ చర్యలను తీసుకోవాలనే సలహా ఇవ్వాలంటూ 29 మార్చి 2023న జరిగిన ఐరాస సర్వసభ్య సమావేశంలో తీర్మానం తీసుకుంటూ అంతర్జాతీయ న్యాయస్థానాన్ని (ఇంటర్నేషనల్ కోర్టు ఆఫ్ జస్టిస్) కోరడం సముచితంగా ఉన్నది. వాతావరణ మార్పులను తగ్గించడానికి అంతర్జాతీయ చట్టాలు, బాధ్యతల ఏ విధంగా ఉండాలనే విషయాన్ని చర్చించాల్సిన అగత్యం ఏర్పడిందని గమనించారు. వాతావరణ మార్పులకు కారణమైన దేశాల మూలంగా పలు చిన్న దేశాలు సర్వస్వం కోల్పోవలసి రావడం విచారకరమే కాదు ఖండనీయం కూడా. 2015లో చేసిన పారిస్ ఒప్పందం చేసిన నాటి నుంచి నేటి వరకు అనేక ఐరాస వేదికలు వాతావరణ మార్పుల పట్ల విశ్వ దేశాలను హెచ్చరించడం, ముఖ్యంగా ప్రతికూల మార్పులకు కారణమవుతున్న అభివృద్ధి చెందిన దేశాలను ఒప్పించి రాబోయే తరం సుఖమయ జీవనానికి ధరణిని కాపాడవలసిన ఆవశ్యకతను గమనిస్తూ, దానికి అనుగుణంగా పరిస్థితులను నెలకొల్పేలా చర్యలు ప్రారంభం కావాలి.

వాతావరణ మార్పులపై ఇండియా అభిప్రాయం:

వాతావరణ మార్పులను కట్టడి చేయడంలో కంకణబద్ధత కలిగిన ఇండియా 2070 నాటికి జీరో కార్బన్ ఉద్గార స్థితికి చేరడమే కాకుండా 2030 నాటికి 50 శాతం పునరుత్పాదక శక్తి వనరులను వినియోగించే స్థాయికి చేరతామని స్పష్టం చేసిన విషయం మనకు విధితమే. భూతాపాన్ని తగ్గించడంలో అభివృద్ధి చెందిన దేశాలు భాద్యత తీసుకొని నాయకత్వం వహించాలని భారతం తలుస్తున్నది. 'తాగినోడే తాళ్ళ పన్ను కట్టాలనే' చందంగా వాతావరణ ప్రతికూల మార్పులకు కారణమైన దేశాలే తిరిగి సరి చేయవలసి ఉంటుందని అందరూ సమ్మతిస్తున్నాం. తాజాగా ఐరాస తీసుకున్న తీర్మానంపై యూయస్, చైనా లాంటి అగ్ర దేశాల స్పందనను ఇండియా గమనిస్తూ వేచిచూసే ధోరిణిని అవలంభిస్తున్నది. ప్రపంచ దేశాలు దౌత్య చర్చలు, న్యాయ వ్యవస్థ ప్రక్రియల ద్వారా సమర్థవంతంగా వాతావరణ మార్పుల కట్టడికి నడుం బిగించాలని యూయస్ భావిస్తున్నట్లు తెలుస్తున్నది. వాతావరణ మార్పుల కట్టడికి అగ్ర దేశాలు ముందు నడుబిగించాలని, వారి ఉద్యమానికి ఇతర చిన్న, పెద్ద అభివృద్ధి చెందుతున్న దేశాలు తోడవుతాయని ఇండియా లాంటి దేశాలు అభిప్రాయ పడుతున్నది.

భూతాప కట్టడికి చర్యలు తక్షణావసరం:

వాతావరణ ప్రతికూల మార్పులను ప్రతిఘటిస్తూ భూతాపాన్ని 1.5 – 2 డిగ్రీ సెల్సియస్ తగించడం తక్షణ అవసరమని అన్ని దేశాలు అంగీకరిస్తున్నాయి. ప్రస్తుతం వాతావరణ ప్రతికూల మార్పుల ఫలితంగా పారిశ్రామిక విప్లవ కాలంతో పోల్చితే నేడు భూతాపం 1.1 డిగ్రీలు పెరిగిందని గమనించారు. హరిత గృహ వాయువు(గ్రీన్ హౌజ్ గ్యాసెస్)ల ఉద్గారాలను 2030 నాటికి సగం తగ్గించడానికి శిలాజ ఇంధనాల వాడకాన్ని తగ్గిస్తూ, తరగని శక్తి వనరులను వినియోగంలోకి తేవలసి ఉంటుందని అందరు నమ్ముతున్నారు. "వాతావరణ అత్యవసర స్థితి (క్లైమేట్ ఎమర్జెన్సీ)" వచ్చిందని, ఇప్పుడు తగిన చర్యలను ప్రపంచ దేశాలు తీసుకోని ఎడల భూమి నివాసయోగ్యతను కోల్పోయి స్మశానంగా మారుతుందంటూ నిపుణులు హెచ్చరిస్తున్నారు. వాతావరణ ప్రతికూల మార్పులకు కారణమైన అభివృద్ధి నిరర్థకమైనదే అని, సుస్థిరాభివృద్ధి దిశగా మానవాళి పటిష్ట అడుగులను తక్షణమే వేయాల్సిన అగత్యం ఏర్పడిందని మరిచి పోరాదు.

సిఒపి(కోప్)–27 సూచనలు పాటించలేమా..!

వాతావరణ మార్పులకు పలు దేశాలు తీసుకోవలసిన చర్యలను నిర్దేశించడం, సమీక్షించడం, అవసరమైతే హెచ్చరించడానికి కూడా ఓ పటిష్ట వ్యవస్థ కావాలని, అంతర్జాతీయ న్యాయస్థాన తీర్పు చట్టబద్ధత కలిగినది కాదని, అతిక్రమించిన దేశాలను దారిని పెట్టలేదని గమనిస్తూ అన్ని దేశాలు స్వచ్ఛందంగా తమ భాద్యతలను విస్మరించక, సకాలంలో సానుకూల చర్యలకు పూనుకోవాలి. సిఒపి–27 (కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్–27) సూచించినట్లు మార్పుల కట్టడికి నిధుల కల్పన, వాతావరణ న్యాయం (క్లైమేట్ జస్టిస్), నైతిక ప్రతిస్పందన అవసరమని పలు మార్లు కోరడం మనకు తెలుసు.

'చేతులు కాలక ముందే ఆకులు పట్టుకోకపోతే' జీవకోటి మనుగడ ప్రమాదంలోకి నెట్టబడుతుంది. అభివృద్ధి పేరుతో వాతావరణాన్ని విధ్వం చేయరాదు. 'మనం కూర్చున్నా కొమ్మను (భూమాతను) మనమే నరుక్కోరాదు'. 'మనం తీసుకున్న గోతిలో మనమే పడతామని' తెలుసుకోవలసిన సమయం ఆసన్నమైంది. 'చెప్పింది వినకపోతే చెడంగ చూడాల్సిందే' అనే ఇంగిత జ్ఞానం అగ్ర దేశాలకు అవగతం కావాలి. వాతావరణ సానుకూల మార్పుల దిశగా ప్రపంచ దేశాలు అడుగులు వేయాలని ఆశిద్దాం.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# రెండవ టూరిజం వర్కింగ్ గ్రూప్ మీటింగ్‌లో హరిత పర్యాటకాన్ని (గ్రీన్ టూరిజం) అత్యంత ముఖ్యమైన ప్రాధాన్యతగా ఏకగ్రీవంగా ఆమోదించిన దేశాలు




న్యూఢిల్లీ, ఏప్రిల్ 7:డార్జిలింగ్ జిల్లాలోని సిలిగురిలో 2023 ఏప్రిల్ 1 నుంచి 4 వరకు జరిగిన 2వ టూరిజం వర్కింగ్ గ్రూప్ సమావేశం విజయవంతంగా ముగిసిన అనం తరం పర్యాటక శాఖ కార్యదర్శి శ్రీ అరవింద్ సింగ్ జాతీయ మీడియాతో మాటాడారు.

ఈ కార్యవర్గ బృందం సమావేశానికి 17 సభ్యదేశాలు, 8 ఆహ్వానిత దేశాలు, 4 అంతర్జాతీయ సంస్థల నుంచి 56 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, జపాన్, సింగపూర్, మెక్సికో, ఇండోనేషియా, కొరియా మొదలైన ఏడు జీ20 దేశాల రాయబారులు కూడా హాజరయ్యారు. ప్రారంభ సమావేశంలో కేంద్ర పర్యాటక, సాంస్కృతిక, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖల మంత్రి శ్రీ జి.కిషన్ రెడ్డి, మైనారిటీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి శ్రీ జాన్ బర్లా పాల్గొన్నారు.

సభ్య దేశాలు, ఆహ్వానిత దేశాలు,యు ఎన్ ఇ పి, ఐఎల్ఓ,యు ఎన్ డబ్ల్యూ టి ఒ వంటి అంతర్జాతీయ సంస్థలతో జరిగిన వర్కింగ్ గ్రూప్ సమావేశాల గురించి పర్యాటక శాఖ కార్యదర్శి మీడియాకు వివరించారు.

టూరిజం వర్కింగ్ గ్రూప్ సమావేశం మొదటి సెషన్ లో యు ఎన్ ఇ పి 'ట్రావెల్ ఫర్ లైఫ్' ఎల్ పై, యు ఎన్ డబ్ల్యూ టి ఒ ' మొదటి డ్రాఫ్ట్ అవుట్ కమ్ డాక్యుమెంట్ – గోవా రోడ్ మ్యాప్ 'పై ప్రజెంటేషన్ లు ఇచ్చాయని శ్రీ అరవింద్ సింగ్ మీడియాకు వివరించారు. జి20 సభ్య దేశాలు, ఆహ్వానిత దేశాలు, అంతర్జాతీయ సంస్థలు గోవా రోడ్ మ్యాప్ మొదటి ముసాయిదాపై తమ అభిప్రాయాలను పంచుకున్నాయి. 2023 జూన్ లో గోవాలో జరిగే టూరిజం మినిస్టీరియల్ మీటింగ్ లో గోవా రోడ్ మ్యాప్ ను ఆమోదించనున్నారు.

వర్కింగ్ గ్రూప్ సమావేశంలో తుర్కియే, సౌదీ అరేబియా, ఆస్ట్రేలియా, ఇండోనేషియా, ఇటలీ వరుసగా గ్రీన్ టూరిజం, డిజిటలైజేషన్, స్కిల్స్, టూరిజం ఎంఎస్ఎం లు, డెస్టినేషన్ మేనేజ్ మెంట్ అనే ఐదు ప్రాధాన్యతలపై ప్రజెంటేషన్లు ఇచ్చాయి. ఈ సమావేశంలో ప్రతి ప్రాధాన్య అంశంపై విస్తృతంగా చర్చించారు. భాగస్వామ్య దేశాలన్నింటికీ హరిత పర్యాటకం (గ్రీన్ టూరిజం) అత్యంత ముఖ్యమైన ప్రాధాన్యమని అన్ని దేశాలు ఏకగ్రీవంగా అంగీకరించినట్టు కార్యదర్శి వెల్లడించారు.

జూన్ లో గోవాలో జరిగే టూరిజం మినిస్టీరియల్ మీటింగ్ లో తుది గోవా ప్రకటనను రూపొందించడానికి మొదటి రెండు టూరిజం వర్కింగ్ గ్రూప్ సమావేశాల్లో చర్చలు సరైన దిశలో సాగుతున్నాయనే వ్యాఖ్యలతో పర్యాటక శాఖ కార్యదర్శి మీడియా సమావేశాన్ని ముగించారు.

వర్కింగ్ గ్రూప్ సమావేశాలలో భాగంగా, భారతదేశం , ఈశాన్య ప్రాంత పర్యాటక పటంలో అడ్వెంచర్ టూరిజం సామర్థ్యాన్ని హైలైట్ చేయడానికి అడ్వెంచర్ టూరిజంపై రెండు ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. అడ్వెంచర్ టూర్ ఆపరేటర్స్ అసోసియేషన్ (ఎటిఎ) కు చెందిన శ్రీమతి గాబ్రియెల్లా స్టోవెల్ (వైస్ ప్రెసిడెంట్) , అడ్వెంచర్ టూర్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎటిఒఎఐ) అధ్యక్షుడు పద్మశ్రీ అవార్డు గ్రహీత శ్రీ అజిత్ బజాజ్ అడ్వెంచర్ టూరిజంపై ప్రపంచ, భారతీయ దృక్పధాలను సమర్పించారు.

దేశీయ పారిశ్రామిక భాగస్వాములు, భారత దేశ రాష్ట్రాల కోసం స్థానిక వాటాదారుల తో కలసి 'టూరిజం ఇన్ మిషన్ మోడ్: అడ్వాంటేజ్ అడ్వెంచర్ టూరిజం' అనే అంశంతో రెండవ కార్యక్రమం నిర్వహించారు. ఉత్తమ పద్ధతులు, నేషనల్ స్ట్రాటజీ ఆఫ్ అడ్వెంచర్ టూరిజం, అడ్వెంచర్ డెస్టినేషన్ గా ఇండియా, అడ్వెంచర్ సేఫ్టీ మోడ్రన్ లా, రిస్క్ మిటిగేషన్ అండ్ యాక్సెస్ కంట్రోల్, వైబ్రెంట్ విలేజెస్ ను అడ్వెంచర్ డెస్టినేషన్ గా అభివృద్ధి చేయడం, ఈశాన్య రాష్ట్రాల్లో అడ్వెంచర్ టూరిజంను అభివృద్ధి చేయడంపై చర్చించారు.

అడ్వెంచర్ టూరిజం సైట్ల కోసం స్టేట్ ర్యాంకింగ్ ప్రమాణాలు, మోడల్ అడ్వెంచర్ టూరిజం చట్టం, మెగా ట్రైల్స్ అభివృద్ధి, అడ్వెంచర్ యాక్టివిటీ గైడ్ లైన్స్ అభివృద్ధి, అడ్వెంచర్ టూరిజం రెస్క్యూ సెంటర్లు, అడ్వెంచర్ టూరిజం కోసం ప్రత్యేక వెబ్ సైట్ ,సోషల్ మీడియా పేజీల అభివృద్ధి వంటి కార్యక్రమాలను భారత ప్రభుత్వ పర్యాటక, సాంస్కృతిక , డోనర్ మంత్రి తన ప్రారంభ ప్రసంగంలో పంచుకున్నారు.

ఈ ప్రాంత సుసంపన్నమైన స్థానిక సంప్రదాయాలను అనుభూతి చెందేలా అంతర్జాతీయ ప్రతినిధులకు మూన్ లైట్ తేయాకు ను తీసే కార్యక్రమం ఏర్పాటు చేశారు. వారితో పాటు స్థానిక టీ ప్లకర్లు, సంప్రదాయ వాద్యాల సంగీతకారులు వారిని ఉత్సాహపరిచారు. మూన్ లైట్ తేయాకు తీయడం ప్రపంచంలోని అత్యంత సాంప్రదాయ తేయాకు తీసే పద్ధతులలో ఒకటి. 'పొలం నుంచి కర్మాగారానికి' తేయాకు ఆకుల ప్రాసెసింగ్ విధానాన్ని చూసేందుకు వారు మకైబరి టీ ఫ్యాక్టరీని సందర్శించారు. టీ ఫ్యాక్టరీలో సాయంత్రం , సైడ్ ఈవెంట్ తరువాత టీ టేస్టింగ్ సెషన్ నిర్వహించారు. ఇది ప్రతినిధులందరి ప్రశంసలు అందుకుంది.

యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్ అయిన డార్జిలింగ్ హిమాలయన్ రైల్వేలో ప్రయాణించడంతో వర్కింగ్ గ్రూప్ సమావేశం ముగిసింది. భారతదేశపు ఎత్తైన ఘుమ్ రైల్వే స్టేషన్ నుండి ఈ ప్రయాణం ప్రారంభమైంది. రైలు ప్రయాణంలో మొదటి స్టాప్ బటాసియా లూప్ వద్ద ఉంది, అక్కడ సైనిక్ బోర్డు ప్రత్యేక ఖుకురి నృత్యాన్ని నిర్వహించింది. రైలు ప్రయాణం డార్జిలింగ్ స్టేషన్ లో ముగిసింది. అనంతరం డార్జిలింగ్ లోని రాజ్ భవన్ ను పశ్చిమబెంగాల్ గవర్నర్ శ్రీ సి.వి.ఆనందబోస్ తో కలిసి సందర్శించారు.

రాష్ట్రప్రభుత్వం ఈ సందర్భంగా డిఐవై యాక్టివిటీస్ ద్వారా కమ్యూనిటీ భాగస్వామ్యం ప్రాముఖ్యతను తెలియజేస్తూ స్థానిక చేతి వృత్తులు, హస్త కళాకారుల ప్రతిభ ను ప్రదర్శించడానికి ఏర్పాటు చేసిన క్రాఫ్ట్ బజార్ ను ప్రతినిధులు సందర్శించారు. వారి ఆసక్తి, ప్రోత్సాహం స్థానిక కళాకారులను ఉత్సాహపరిచింది.

# నాగా సంస్కృతి అనేది హుషారు, పరాక్రమం మరియు ప్రకృతి పట్ల గౌరవంలకు సమానార్థకంగా ఉంది: ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7:నాగాలాండ్ ప్రభుత్వం లో పిహెచ్ఇడి మరియు సహకార శాఖ మంత్రి గా ఉన్నటువంటి శ్రీ జేకబ్ ఝిమోమీ చేసిన కొన్ని ట్వీట్ లకు ప్రధాన మంత్రి సమాధానాన్ని ఇస్తూ, "జి–20 కార్యక్రమాల లో భాగం గా ఉన్నటువంటి ఒక కార్యక్రమం లో, విశిష్టమైనటువంటి నగా సంస్కృతి ని ఒక మంచి ట్వీట్ ల మాలిక ద్వారా కళ్లకు కట్టడం జరిగింది. నగా సంస్కృతి అంటే అది హుషారు, పరాక్రమం మరియు ప్రకృతి పట్ల గౌరవ భావం లకు పర్యాయం గా ఉంది." అని పేర్కొన్నారు.

శ్రీ జేకబ్ ఝిమోమీ తన ట్వీట్ లలో, జి–20 ప్రతినిధి వర్గం సభ్యుల కు నాగాలాండ్ లోని కోహిమా లో హృదయపూర్వక స్వాగతాన్ని పలుకుతున్నట్లు పేర్కొన్నారు.

శక్తియుక్తులైనటువంటి నగా సోదరులు మరియు నగా సోదరీమణులు సాంప్రదాయిక నగా నృత్యాన్ని ప్రదర్శించి ప్రతినిధి వర్గం సభ్యుల కు స్వాగతం పలికారని కూడా ఆయన అన్నారు.

"జి–20 కార్యక్రమాల లో భాగం గా జరిగిన ఒక కార్యక్రమం లో అద్భుతమైనటువంటి నగా సంస్కృతి ని ఒక మంచి ట్వీట్ ల మాలిక రూపం లో కళ్లకు కట్టినట్లు వివరించడం జరిగింది. నగా సంస్కృతి అంటే అది హుషారు, పరాక్రమం మరియు ప్రకృతి పట్ల గౌరవం లకు మారు పేరు గా ఉంది." అని పేర్కొన్నారు.

# అరుదైన భూ నిక్షేపాల తవ్వకాలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7:అరుదైన భూ నిక్షేపాలు కలిగి ఉన్న దేశాల్లో ప్రపంచంలో భారతదేశం 5వ స్థానంలో ఉంది. భారతదేశంలో లభిస్తున్న వనరులు గణనీయంగా లీన్ లితీబి గ్రేడ్ తో రేడియోధార్మికత కలిగి ఉన్నాయి. నిక్షేపాలు వెలికి తీయడానికి ఎక్కువ సమయం పట్టడమే కాకుండా ప్రక్రియ సంక్లిష్టంగా ఖర్చుతో కూడుకున్న పైగా ఉంటుంది. భారతదేశంలో లభిస్తున్న వనరులు భారతీయ వనరులు లైట్ రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ (ఒఖీఇఇ) కలిగి ఉన్నాయి. అయితే హెవీ రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ (ఊఖీఇఇ) వెలికి తీయదగిన పరిమాణంలో అందుబాటులో లేవు.

అరుదైన భూ నిక్షేపాలను వెలికి తీయడానికి, లభిస్తున్న ప్రాంతాల నుంచి శుద్ధి కేంద్రాలు/ప్లాంట్లకు రవాణా చేసి విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చడానికి సుదీర్ఘమైన పర్యావరణ వ్యవస్థ అవసరం ఉంటుంది. తవ్వకాల కోసం చట్టబద్ధమైన అనుమతులు పొందడం, మైనింగ్,నిక్షేపాలు వేరు చేయడం, వెలికితీత, వేరు చేయడం, ఆక్సైడ్‌లలో శుద్ధి చేయడం, మెటల్ వెలికితీత, మిశ్రమం తయారీ వంటివి ఉంటాయి. అల్లాయ్‌ను మాగ్నెట్‌గా మార్చి ఆ తర్వాత శక్తి ఆదా చేసే ఉపకరణాలలో తుది ఉత్పత్తి మోటారుగా ఉపయోగించాల్సి ఉంటుంది. తుది ఉత్పత్తిలో అరుదైన మూలకాల వినియోగం తక్కువ పరిమాణంలో ఉంటుంది.

మైనింగ్ నుంచి వేరు చేయడం, ఆక్సైడ్ రూపంలో శుద్ధి చేయడం, మెటల్ వెలికితీత సామర్థ్యాన్ని అభివృద్ధి చేయడం వరకు భారతదేశంలో సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. అయితే, మిశ్రమం, అయస్కాంతం మొదలైన వాటి నుండి పారిశ్రామిక స్థాయి సౌకర్యాలు (మధ్యస్థ) అందుబాటులో లేవు . ఈ మిశ్రమంలో రేర్ ఎర్త్ ఒక చిన్న భాగం గా ఉంటుంది. ప్రక్రియ పూర్తి చేయడానికి అరుదైన భూమి మూలకాలు (ఖీఇఇ) కాకుండా అనేక ఇతర పదార్థాలు అవసరం ఉంటాయి. మెటల్ వెలికితీత దశ నుంచి ఈ రంగం ఉచిత కేటగిరీ కింద ఉన్నప్పటికీ, సాంకేతిక అందుబాటులో లేని కారణంగా మధ్యస్థ విభాగంలో పరిశ్రమలు ఏర్పాటు కాలేదు.

కేరళ, తమిళనాడు, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర,గుజరాత్‌లోని కొన్ని ప్రాంతాలలో తీరప్రాంత ఇసుకలో మరియు జార్ఖండ్, పశ్చిమ బెంగాల్‌లోని కొన్ని మారుమూల ప్రాంతాలలో 13.07 మిలియన్ టన్నులు మోనజైట్ (దీ55–60% మొత్తం రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ ఆక్సైడ్ కలిగి ఉంటుంది) ఉన్నట్లు గుర్తించారు. విలువ పరంగా అరుదైన ఎర్త్‌ల వినియోగంలో 80% కంటే ఎక్కువ ఖీఇ శాశ్వత అయస్కాంతాల లో ఉంది. దీనికోసం మాగ్నెటిక్ ఖీఇఇ అంటే నియోడిమియం, ప్రాసియోడైమియం, డిస్ప్రోసియం మరియు టెర్బియం అవసరం ఉంటుంది. ఇంధన పరివర్తన కార్యక్రమంలో వీటి వినియోగం ఎక్కువగా ఉంది. అధిక విలువ కలిగిన డిస్ప్రోసియం, టెర్బియం భారతదేశంలో వెలికి తీయడానికి తగినంత పరిమాణంలో లభించడం లేదు. నియోడిమియం, ప్రాసియోడైమియం మాత్రమే భారతదేశంలో లభిస్తున్నాయి. వీటిని 99.9% స్వచ్ఛత స్థాయి వరకు వెలికి తీస్తున్నారు. భారతదేశంలో బీఎస్ఎం ఇనుప ఖనిజంలో 0. 0011 నుంచి 0.012% వరకు నియోడిమియం, ప్రాసియో డైమియం ఉన్నాయి. తీరా ప్రాంత పరిరక్షణ నిబంధనలు, మడ అడవులు, అడవులు కారణంగా అరుదైన భూ నిక్షేపాల తవ్వకాలు పరిమితంగా సాగుతున్నాయి.

అరుదైన భూమి వనరులను (లైట్ రేర్ ఎర్త్స్) లోహ వెలికితీత వరకు చేపట్టడానికి భారతదేశంలో సామర్థ్యం ఉంది. టొయోట్సు రేర్ ఎర్త్స్ ఇండియా లిమిటెడ్, విశాఖపట్నం, టయోటో సుషో కార్పొరేషన్, జపాన్ అనుబంధ సంస్థ ఐఆర్ఇఎల్ నుండి అరుదైన ఇసుక రేణువులను గుర్తించి అరుదైనమూలకాలను శుద్ధి చేసే కార్యక్రమాన్ని అమలు చేస్తోంది.

ఈ సమాచారాన్ని సిబ్బంది వ్యవహారాలు, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్, ప్రధానమంత్రి కార్యాలయం సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ఈరోజు రాజ్యసభలో ఒకే ప్రశ్నకు లిఖితపూర్వకంగా ఇచ్చిన సమాధానంలో తెలిపారు.

# చెన్నై విమానాశ్రయంలో నిర్మాణం పూర్తి అయిన కొత్త అత్యాధునిక ఏకీకృత టర్మినల్ భవనం

చెన్నై,ఏప్రిల్ 7: చెన్నై విమానాశ్రయం లో నిర్మాణం పూర్తి అయిన కొత్త అత్యాధునిక ఏకీకృత టర్మినల్ భవనం చెన్నై యొక్క మౌలిక సదుపాయాల వ్యవస్థ లో ఒక ముఖ్యమైన అదనపు చేర్పు కానుంది అని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అన్నారు. ఆ భవనం కనెక్టివిటీ ని వృద్ధి చెందింప చేయడంతో పాటుగా స్థానిక ఆర్థిక వ్యవస్థ కు లాభాన్ని కూడా అందించనుంది అని శ్రీ నరేంద్ర మోదీ అన్నారు.

చెన్నై విమానాశ్రయం లో నూతనం గా నిర్మించిన అత్యాధునిక ఏకీకృత టర్మినల్ భవనం లోని ఒకటో దశ ను గౌరవనీయులైన ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2023 ఏప్రిల్ 8వ తేదీ నాడు ప్రారంభించనున్నారు అని పౌర విమానయానం మంత్రిత్వ శాఖ కొన్ని ట్వీట్ లలో తెలియ జేసింది.

పౌర విమానాయానం మంత్రిత్వ శాఖ ట్వీట్ కు ప్రధాన మంత్రి సమాధానాన్ని ఇస్తూ –"ఇది చెన్నై లోని మౌలిక సదుపాయాల వ్యవస్థ కు ఒక ముఖ్యమైనటువంటి అదనపు చేర్పు కానుంది. ఇది కనెక్టివిటీ ని వృద్ధి చెందింప చేస్తుంది. దానితో పాటుగా స్థానిక ఆర్థిక వ్యవస్థ కు కూడా లాభాన్ని అందిస్తుంది." అని ఒక ట్వీట్ లో పేర్కొన్నారు.

# ప్రభుత్వ పనితీరుపై ప్రజల అభిప్రాయాలు తెలుసుకున్న, కోలగట్ల



విజయనగరం, ఏప్రిల్ 7: ఏమమ్మా మీకు పింఛన్ వస్తుందా.. చేయూత వచ్చిందా.. మీ పిల్లలకు అమ్మఒడి డబ్బులు పడ్డాయా.. పాఠశాలల రూపు రేఖలు మారాయా.. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందుతుందా.. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఎలా ఉంది? మీకు ఏ సమస్య వచ్చినా మా ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు అందుబాటులో ఉంటున్నారా.. మళ్లీ జగన్ ను ముఖ్యమంత్రిని చేద్దాం.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి మీ మద్దతు తెలపండి అని ఏపీ శాసనసభ ఉపసభాపతి, విజయనగరం నియోజకవర్గ శాసనసభ్యులు కోలగట్ల వీరభద్ర స్వామి ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. జగనన్నే మా భవిష్యత్తు– మా నమ్మకం నువ్వే జగన్ ప్రారంభ కార్యక్రమాన్ని శుక్రవారం విజయనగరంలోని ఒకటవ డివిజన్లో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. ప్రభుత్వ పనితీరుపై వారి అభిప్రాయాలను తీసుకున్నారు. ప్రభుత్వం ముద్రించిన కరపత్రాలను చదువుతూ, వారు ఏయే సంక్షేమ పథకాల లబ్ధి పొందారో అడిగి తెలుసుకున్నారు.

అవినీతి, మధ్యవర్తిత్వం లేకుండా పథకాలు అందుతున్నాయా అని ఆరా తీశారు. గత ప్రభుత్వానికి.. ప్రస్తుత జగన్ ప్రభుత్వానికి మధ్య తేడాను వివరించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. పలువురు వృద్ధులు తమ అభిప్రాయాలను వెల్లడిస్తూ తమకు ప్రతినెల ఇంటికే పింఛన్ తెచ్చిస్తున్నారని, మా ఇంట్లో పిల్లలకు అమ్మఒడి అందుతుందని.. ప్రభుత్వ పాఠశాలల్లో చక్కగా చదువుకుంటున్నారని తెలిపారు. పలువురు మహిళలు మాట్లాడుతూ.. చేయూత, ఆసరా వంటి పథకాలతో తమ ఇంట్లో వెలుగులు నిండుతున్నాయని వివరించారు. నేరుగా తమ ఖాతాల్లోకి డబ్బులు పడుతుండటం వల్ల గతం మాదిరి అవినీతికి తావు ఉండటం లేదని చెప్పారు. మళ్లీ మళ్లీ ఈ ప్రభుత్వమే రావాలని తామంతా ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ప్రజల అనుమతితో "జగనన్నే మా భవిష్యత్తు" స్టిక్కర్లను ఆయా ఇళ్ల వద్ద కోలగట్ల అతికించారు. ఇంకేమైనా సమస్యలు ఉంటే.. 82960 82960 నంబర్ కు మిస్డ్ కాల్ ఇవ్వాలని, వెంటనే పరిష్కరిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. ప్రభుత్వానికి తమ మద్దతు తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అంతకుముందు బంగారమ్మపేట ప్రచారంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతీ దేవి , పార్టీ జోనల్ ఇన్చార్జులు, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సవరించిన దేశీయ గ్యాస్ ధర మార్గదర్శకాలకు మంత్రివర్గ ఆమోదం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఓఎన్‌జీసీ/అయిల్ అన్వేషణ లైసెన్సింగ్ పాలసీ (ఎన్ఈఎల్‌పి) బ్లాక్‌లు మరియు ప్రీ–ఎన్ఈఎల్‌పి బ్లాక్‌ల నుండి ఉత్పత్తి చేయబడిన గ్యాస్‌కు సంబంధించి సవరించిన దేశీయ సహజ వాయువు ధరల మార్గదర్శకాలను ఆమోదించింది. ఉత్పత్తి భాగస్వామ్య ఒప్పందం (పిఎస్‌సీ) ధరలకు ప్రభుత్వం ఆమోదం అందిస్తుంది. అటువంటి సహజ వాయువు ధర భారతీయ క్రూడ్ బాస్కెట్ నెలవారీ సగటులో 10% ఉండాలి మరియు నెలవారీ ప్రాతిపదికన తెలియజేయబడుతుంది. ఓఎన్‌జీసీ డఆయిల్ నామినేషన్ బ్లాక్‌ల నుండి ఉత్పత్తి చేసే గ్యాస్ కోసం అడ్మినిస్టర్డ్ ప్రైస్ మెకానిజం (ఏపీఎం) ధర ఫ్లోర్ మరియు సీలింగ్‌కు లోబడి ఉంటుంది. కొత్త బావుల నుండి ఉత్పత్తి చేయబడిన గ్యాస్ లేదా ఓఎన్‌జీసీడఆయిల్ నామినేషన్ ఫీల్డ్‌లలో జోక్యం చేసుకుంటే ఏపీఎం ధర కంటే 20% ప్రీమియం అనుమతించబడుతుంది. వివరణాత్మక నోటిఫికేషన్ విడిగా విడుదల చేయబడుతోంది. దేశీయ గ్యాస్ వినియోగదారులకు స్థిరమైన ధరల పాలనను నిర్ధారించడానికి కొత్త మార్గదర్శకాలు ఉద్దేశించబడ్డాయి. అదే సమయంలో ఉత్పత్తిని పెంచడానికి ప్రోత్సాహకాలతో ప్రతికూల మార్కెట్ హెచ్చుతగ్గుల నుండి ఉత్పత్తిదారులకు తగిన రక్షణను అందిస్తాయి. 2030 నాటికి భారతదేశంలో ప్రాథమిక ఇంధన మిశ్రమంలో సహజ వాయువు వాటాను ప్రస్తుత 6.5% నుండి 15%కి పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. సంస్కరణలు సహజ వాయువు వినియోగాన్ని విస్తరించడంలో సహాయపడతాయి. అలాగే ఉద్గార తగ్గింపు మరియు నికర సున్నా లక్ష్యాన్ని సాధించడంలో దోహదపడతాయి. ఈ సంస్కరణలు నగర గ్యాస్ పంపిణీ రంగానికి దేశీయ గ్యాస్ కేటాయింపును గణనీయంగా పెంచడం ద్వారా భారతదేశంలో గ్యాస్ ధరలపై అంతర్జాతీయ గ్యాస్ ధరల పెరుగుదల ప్రభావాన్ని తగ్గించడం అలాగే వినియోగదారుల ప్రయోజనాలను పరిరక్షించడానికి భారత ప్రభుత్వం తీసుకున్న వివిధ కార్యక్రమాల కొనసాగింపులో భాగం. ఈ సంస్కరణల వల్ల గృహాలకు పైప్డ్ నేచురల్ గ్యాస్ (పిఎన్‌జీ) మరియు కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ (సిఎన్‌జీ) ధరలు గణనీయంగా తగ్గుతాయి. తగ్గిన ధరలు ఎరువుల సబ్సిడీ భారాన్ని కూడా తగ్గిస్తాయి. దేశీయ విద్యుత్ రంగానికి సహాయపడతాయి. గ్యాస్ ధరలలో ఫ్లోర్ సదుపాయంతో పాటు కొత్త బావుల కోసం 20% ప్రీమియం అందించడంతో పాటు ఈ సంస్కరణ ఓఎన్‌జీసీ మరియు ఆయిల్‌లను అప్‌స్ట్రీమ్ రంగంలో అదనపు దీర్ఘకాలిక పెట్టుబడులు పెట్టడానికి ప్రోత్సహిస్తుంది. ఇది సహజ వాయువు అధిక ఉత్పత్తికి దారి తీస్తుంది మరియు ఫలితంగా దిగుమతి తగ్గుతుంది. సవరించిన ధరల మార్గదర్శకాలు గ్యాస్ ఆధారిత ఆర్థిక వ్యవస్థ వృద్ధి ద్వారా తక్కువ కార్బన్ పాదముద్రను ప్రోత్సహిస్తాయి.

ప్రస్తుతం దేశీయ గ్యాస్ ధరలు 2014లో ప్రభుత్వం ఆమోదించిన కొత్త డొమెస్టిక్ గ్యాస్ ధరల మార్గదర్శకాలు, 2014 ప్రకారం నిర్ణయించబడ్డాయి. 2014 ధరల మార్గదర్శకాలు దేశీయ గ్యాస్ ధరల కోసం 6 నెలల వ్యవధిలో ఉన్న వాల్యూమ్ వెయిటెడ్ ధరల ఆధారంగా ప్రకటించడానికి అందించబడ్డాయి. నాలుగు గ్యాస్ ట్రేడింగ్ హబ్‌లు – హెన్రీ హబ్, అల్బెనా, నేషనల్ బ్యాలెన్సింగ్ పాయింట్ (యూకె) మరియు రష్యా. 4 గ్యాస్ హబ్‌లపై ఆధారపడిన మునుపటి మార్గదర్శకాలు గణనీయమైన సమయం ఆలస్యం మరియు చాలా ఎక్కువ అస్థిరతను కలిగి ఉన్నందున ఈ హేతుబద్ధీకరణ మరియు సంస్కరణ అవసరం భావించబడింది. సవరించిన మార్గదర్శకాలు ముడి చమురుతో ముడిపడి ఉంటాయి. ఇది ఇప్పుడు చాలా పరిశ్రమల ఒప్పందాలలో అనుసరించే పద్ధతి. ఇది మన వినియోగ బాస్కెట్‌కు మరింత సందర్భోచితంగా ఉంటుంది మరియు రియల్ టైమ్ ప్రాతిపదికన గ్లోబల్ ట్రేడింగ్ మార్కెట్‌లలో లోతైన ద్రవ్యతను కలిగి ఉంటుంది. ఇప్పుడు ఆమోదించబడిన మార్పులతో, గత నెలలోని భారతీయ క్రూడ్ బాస్కెట్ ధర డేటా ఏపీఎం గ్యాస్ ధర నిర్ణయానికి ఆధారం అవుతుంది.

# అల్లుడి యువగళంలో మామ ఎంట్రీ - గంజాయి వద్దు బ్రో అంటూ డైలాగ్స్ ..



అమరావతి, ఏప్రిల్ 7:టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ప్రస్తుతం శింగనమల నియోజకవర్గం లో కొనసాగుతున్నది.. నేటి యాత్రలో లోకేష్ మామ, హీరో బాలకృష్ణ పాల్గొని సంఘీభావం తెలిపారు..నేటి పాదయాత్రను గంజాయి వద్దు బ్రో అనే కాన్సెప్ట్ తో ముందుకు సాగింది.. మామ, అల్లుళ్లు గంజాయి వద్దు బ్రో రాసి ఉన్నటి షర్ట్స్ ధరించారు.. . ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. “గంజాయి ఏపీకి కేర్ ఆఫ్ అడ్రస్‌గా మారింది. గత 63 రోజులుగా డ్రగ్స్ సంస్కృతికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నా. సీఎం జగన్ పాలనలో ఏపీ గంజాయి క్యాపిటల్ ఆఫ్ ఇండియాగా మారింది. ఆఖరికి తిరుమలని కూడా వైసీపీ గంజాయి మాఫియా వదలడం లేదు. చివరకు తిరుమలలో కూడా గంజాయి అమ్ముతున్నారు అంటే ఎంత దారుణమైన పరిస్థితి ఉందో అర్థం చేసుకోవచ్చు. గంజాయి వలన యువత భవిష్యత్తు నాశనం అవుతుంది. తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురి అవుతున్నారు. టీడీపీ హయాంలో రూ. 40వేల కోట్లు విలువ చేసే గంజాయిని తగలబెడితే ఇప్పుడు ఏకంగా వైసీపీ నాయకులు గంజాయి పంట వేస్తున్నారు. పాదయాత్రలో ఉండగా చంద్రగిరిలో ఒక తల్లి వచ్చి తన కుమార్తె గంజాయికి బానిస అయ్యిందని ఆవేదన వ్యక్తం చేసింది. ఆ తల్లి చెప్పిన మాటలు నన్ను కలచివేశాయి. అందుకే గంజాయికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటం చెయ్యాలని నిర్ణయం తీసుకున్నాం. టీడీపీ హయాంలో పెట్టిన డీఎడిక్షన్ సెంటర్లు కూడా వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేశారు. యువత అంతా డ్రగ్స్, గంజాయికి దూరంగా ఉండాలి అని పిలుపు ఇస్తున్నా.. టీడీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే వైసీపీ గంజాయి మాఫియాపై చర్యలు తీసుకుంటాం. గంజాయి వద్దు బ్రో..యువత గంజాయికి దూరంగా ఉండాలి అంటూ'' లోకేష్ పిలుపునిచ్చారు.

## తెలంగాణలో అలీబాబా నలభై దొంగల పాలన .. తరుణ్ చుగ్

కరీంనగర్, ఏప్రిల్ 7: తెలంగాణలో అలీబాబా నలభై దొంగల పాలన నడుస్తుందని బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి తరుణ్ చుగ్ ధ్వజమెత్తారు. ఇటీవల మరణించిన బండి సంజయ్ అత్తకు నివాళు లర్పించేందుకు తరుణ్ చుగ్ ఢిల్లీ నుంచి నేరుగా హైదరాబాద్ వచ్చి అక్కడి నుంచి కరీంనగర్ లోని బండి నివాసానికి చేరుకున్నారు. అక్కడ చెట్ల వనజ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బండి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ఆ తర్వాత ఆయన మాట్లాడుతూ? కేసీఆర్ అదేశాల మేరకే రాజ్యాంగ విరుద్ధంగా బండి సంజయ్ ని అరెస్ట్ చేశారన్నారు.

మీరు బీఆర్ఎస్ కార్యకర్తల్లా వ్యవహరించొద్దని, రాజ్యాంగ బద్దంగా ఉంటామని ప్రమాణం చేసారని గుర్తుచేశారు. నోటీస్ లేకుండా అరెస్ట్ చేశారన్నారు. ప్రభుత్వం అహంకారంగా వ్యవహరిస్తుందని, ఎంపీకే వారెంటు లేకుండా అరెస్ట్ చేశారని, సామాన్యుని పరిస్థితి ఏమిటని అన్నారు. కేసీఆర్ కుటుంబ రాజ్యం నడుస్తుందన్నారు. నిరుద్యోగుల కోసం బండి పోరాటం ఆగదన్నారు. లిక్కర్ మాఫియా లూటీ మాఫియాతో పాటు పేపర్ లీక్ మాఫియా నడుస్తుందన్నారు. ప్రజల దృష్టి మళ్లించడానికి బండిని అరెస్ట్ చేశారన్నారు.

# ప్రధానమంత్రి మోడి పర్యటన సందర్భంగా బీసీ బిల్లుపై విధాన ప్రకటన చేయాలి

### -బీసీ ముఖ్య నాయకుల కోర్ కమిటీ సమావేశం డిమాండ్

హైదరాబాద్ ఏప్రిల్ 7 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); ప్రధానమంత్రి మోడి పర్యటన సందర్భంగా బీసీ బిల్లుపై విధాన ప్రకటన చేయాలని బీసీ ముఖ్య నాయకుల కోర్ కమిటీ సమావేశం డిమాండ్ చేసింది.శుక్రవారం కాచిగుడలోని అభినందన్ హోటల్ లో గుజ్జ కృష్ణ, గుజ్జ సత్యం, లాల్ కృష్ణ అధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా రాజ్యసభ సభ సభ్యులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ ఈ నెల 8న ప్రధానమంత్రి నరేంద్ర మోడి హైదరాబాద్ పర్యటన సందర్భంగా బిసిల డిమాండ్లపై ప్రధానమంత్రి విధాన ప్రకటన చేయాలని కోరారు. ముఖ్యంగా కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ, చట్ట సభలలో 50 శాతం రిజర్వేషనుపై విధాన ప్రకటన చేయాలని డిమాండ్ చేసారు. దేశ జనాభాలో 56 శాతం జనాభా గల బీసీలకు చట్టసభలలో రిజర్వేషన్లు పెట్టడానికి పార్లమెంటు లో బీసీ బిల్లు పెట్టాలని బీసీ సంక్షేమ సంఘం నాయకులు గత పది రోజులుగా వేలాది మందితో ఢిల్లీలో పార్లమెంట్ వద్ద ధర్నాలు, ర్యాలీలు, ప్రదర్శనలు, పార్లమెంటు ముట్టడి లాంటి కార్యక్రమాలు నిర్వహించారు. తెలంగాణా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక , ఒరిస్సా కు చెందిన వేలాదిమంది నాయకులూ, కార్యకర్తలు ఈ ఉద్యమంలో పాల్గొన్నారు. ఢిల్లీలో బీసీ సంఘం నాయకులు కేంద్రమంత్రులను, పార్లమెంట్ సభ్యులను, ప్రతి పక్ష పార్టీ నేతలను కలిసి బీసీలకు రాజ్యాంగ బద్ధంగా, ప్రజాస్వామ్యబద్ధంగా రావాల్సిన వాటాను ఇవ్వవలసిన ఆవశ్యకతను చెప్పడం జరిగింది. స్వాతంత్రం వచ్చి రాజ్యాంగం అమలు




జరిగిన నాటి నుంచే బీసీలకు విద్యా, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాలలో బీసీలకు అన్యాయం చేశారు. కనీసం ఇప్పుడైనా జనాభా ప్రకారం సమాన వాటా ఇవ్వాలి కానీ 75 సంవత్సరాలు గడుస్తున్న ఇంతవరకు ఏ రంగంలో బీసీలకు వాటా లభించలేదు. రాజకీయరంగంలో 14 శాతం, ఉద్యోగ రంగంలో 16 శాతం, పారిశ్రామిక, వాణిజ్య రంగాలలో ఒక శాతం, ఉన్నత న్యాయస్థానాల్లో 2 శాతం, ప్రైవేటు రంగ ఉద్యోగాలలో 5 శాతం ప్రాతినిధ్యం బీసీ లకు లభించలేదు. దేశ జనాభాలో 56 శాతం జనాభా గల బీసీలకు 75 సంవత్సరాలు స్వాతంత్ర భారతదేశంలో ఇంత తక్కువ ప్రాతినిధ్యం ఉంటే ఇదెట్ల ప్రజాస్వామ్యం అవుతుందని ప్రశ్నించారు. రాజ్యాంగంలో పేర్కొన్న సామాజిక న్యాయం ఇంతవరకు లభించలేదన్నారు. ఈ క్రింది డిమాండ్లు సాధించే వరకు పోరాటం కొనసాగుతుంది. పంచాయతీరాజ్ సంస్థ బి.సి. రిజర్వేషన్లను 34 శాతం నుండి 56 శాతం కు పెంచాలి. ఈ రిజర్వేషన్లకు రాజ్యాంగ భద్రత కల్పించాలి. బి.సి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలి. ఇందుకు రాజ్యాంగ సవరణ చేయాలి. త్వరలో జరిగే జనగణనలో “కుల గణన చేపట్టాలని,బి.సి ల విద్యా, ఉద్యోగ రిజర్వేషన్ల పై ఉన్న క్రిమీ లేయర్ ను తొలగించాలని,కేంద్రంలో బి.సి లకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలి. బి.సి ల అభివృద్ధికి ప్రత్యేక స్కీములను రూపొందించాలని,ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ మాదిరిగా బి.సి లకు సామాజిక రక్షణ, భద్రత కల్పించడానికి “బి.సి. యాక్టు”ను తీసుకరావాలని,రాష్ట్రంలో కేంద్రంలో విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లను బి.సి ల జనాభా ప్రకారం 27 శాతం నుండి 56 శాతం కు పెంచాలని,ప్రైవేట్ రంగ పరిశ్రమలలో, కంపెనీలలో తదితర ప్రైవేట్ రంగాలలో ఎస్సీ/ఎస్టీ/బి.సి లకు జనాభా ప్రకారం ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు పెట్టాలని కోర్ కమిటి సమావేశం డిమాండ్ చేసింది. ఈసమావేశంలో జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం, లాల్ కృష్ణ, నీల వెంకటేష్, సుధాకర్ ముదిరాజ్, భూపేష్ సాగర్, , అనంతయ్య, కె. రాము, నందగోపాల్, వెంకట్ యాదవ్ శ్రీదేవి, దీపికా, మంజులా, పందరి నాద్, తదితరులు పాల్గొన్నారు.

# మీకు దమ్ముంటే ఈ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలి

### -తెలుగు పేపర్ ఎవరు లీక్ చేశారు

### -హిందీ పేపర్ ను లీక్ చేయాల్సిన అవసరం ఎవరికైనా ఉంటుందా?

### -టెక్నాలజీలో మేమే తోపని చెప్పేటోళ్లు లీకేజీ కుట్రను ఎందుకు చేధించడం లేదు?

### -ఎవరో షేర్ చేస్తే నాకేం సంబంధం?

### -బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్

కరీంనగర్ ఏప్రిల్ 7 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);కరీంనగర్ జైలు నుండి విడుదలైన అనంతరం బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, ఎంపీ బండి సంజయ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు.టీఎస్పీఎస్సీ పేపర్ లీకుపై అతి త్వరలో వరంగల్ లో భారీ ఎత్తున నిరుద్యోగ మార్చ్‌పర్ కుట్రదారులు వాళ్లే నన్నారు.-తెలుగు పేపర్ ఎవరు లీక్ చేశారు హిందీ పేపర్ ను లీక్ చేయాల్సిన అవసరం ఎవరికైనా ఉంటుందా? -అని ప్రశ్నించారు.టెక్నాలజీలో మేమే తోపని చెప్పేటోళ్లు లీకేజీ కుట్రను ఎందుకు చేధించడం లేదు?-మీకు దమ్ముంటే ఈ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలి- ఎవరో షేర్ చేస్తే నాకేం సంబంధం?- వరంగల్ కమిషనర్ కు తెలివి ఉందా? మీ చేతగానితనాన్ని మాపై నెడతారా?-కమిషనర్ ... మీ సంగతి తేలుస్తామన్నారు. నల్లగొండ సహా ఇతర జిల్లాల్లో ఏమేం చేశారో అన్నీ బయటకు తీస్తాం- మా అత్తమ్మ నన్ను కొడుకు లెక్క చూసుకుంది. ఆమె చనిపోతే అంతిమ సంస్కార కార్యక్రమాలు నిర్వహించాల్సిన బాధ్యత నామీద ఉందని తెలిసినా కనికరం చూపని పోలీసులు- ప్రజల చేత ఎన్నుకోబడ్డ ఎంపీ పట్ల వ్యవహరించే తీరు ఇదేనా?- ఎందుకు అరెస్ట్ చేశారో చెప్పరు... నోటీసులివ్వరు- పోలీసుల తీరుతో పోలీసులు తలదించుకునే దుస్థితి- సెల్ ఫోన్ తో మీకు ఏం అవసరం?- లీకుతో నాకు సంబంధం లేదని నా పిల్లలు, దేవుడిపై ప్రమాణం చేస్తా- సీపీ... నేను కుట్ర చేసినట్లు ప్రమాణం చేసే దమ్ముందా?- పోలీసులే మీ తీరుతో తలదించుకుంటున్నారన్నారు. 30 లక్షల మంది నిరుద్యోగుల భవిష్యత్ నాశనమైతుంటే కేసీఆర్ ఎందుకు స్పందించరు?- మీరు న్నాళ్లు విలాస వంతమైన జీవితం గడుపుతారు? నా ఇంటిపై దాడిపై ప్రివిలేజ్ నోటీసులిస్తా-బాధ్యులందరినీ కోర్టుకు ఈడుస్తా- నన్ను బొమ్మల రామారంలో రిలీజ్ చేస్తే జైలుకు ఎందుకు పంపారు?- గంటల తరబడి వాహనాల్లో ఎందుకు తిప్పారు?- లీకైన పేపర్ ను జర్నలిస్టు షేర్ చేస్తే తప్పేంటి?- ఎగ్జామ్ సెంటర్లోకి వెళ్లి పేపర్ లీక్ ఎట్లా చేశారు?- నేను 2 వేల మందితో సెల్ఫీలు దిగుతా.... అందరితో లింకులున్నట్లేనా?- పోలీసులకు బలగం సినిమా చూపిస్తేనైనా బంధాల విలువ తెలుస్తుందేమో- నాపై పీడీ యాక్ట్ కేసు పెట్టాలంటున్న హరీష్ పై హత్యానేరం కేసు పెట్టాలి- 1400 మంది బలిదానాలకు కారకుడు హరీషే- కేటీఆర్ ను సీఎం చేస్తే జంప్ జిలానీ హరీషే- ఇంటర్మీడియట్ విద్యార్థుల మరణానికి కారకుడైన కేటీఆర్ పై పీడీ యాక్ట్ పెట్టాలి- దేశంలోని ప్రతిపక్షాలన్నింటికీ డబ్బులిస్తానని చెప్పిన కేసీఆర్ సంగతి తేల్చాలి- ప్రజల కోసం ఎన్ని సార్లైనా జైలుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నా-టీఎస్పీఎస్సీ పేపర్ లీకుపై మాట్లాడితే పిచ్చోడంటారా?-ఆత్మహత్యలు, ఉద్యోగుల జీతాలు సహా ప్రజా సమస్యలపై నిలదీస్తే పిచ్చోళ్లంటారా?- తాగుబోతు చేతిలో తెలంగాణమీ కుటుంబం వేల కోట్లు సంపాదించుకుంటారు... గాణ ప్రజలు బర్బాద్ కావాలా? దమ్ముంటే అభివృద్ధిపై చర్చకు రావాలి- ఇచ్చిన హామీల అమలుపై చర్చించేందుకు సిద్ధమా?- తెలంగాణపై కేసీఆర్ కు తెగదెంపులయ్యాయి-నీ కొడుకు, బిడ్డను జైలుకు పంపడం ఖాయం- జై తెలంగాణ అంటూ జెండా మోసిన వాళ్లంతా ఏమయ్యారు?-కేసీఆర్ కొడుకుకు అహంకారం తలకెక్కింది- దోచుకోవడానికే కేసీఆర్ కుటుంబం పాలన చేస్తోంది- కేసీఆర్ కుటుంబం అవినీతి, అరాచకాలపై ప్రజలు విసిగెత్తిపోయారు...- కేసీఆర్ పాలనను అంతమొందించేందుకు మరో ఉద్యమానికి సిద్ధమైనం-బీఆర్ఎస్ కార్యకర్తాలారా.... తెలంగాణ కోసం కలిసి రండి-తెలంగాణ అభివృద్ధికి మోదీ సిద్ధమైనా సహకరించని కేసీఆర్-రేపు పరేడ్ గ్రౌండ్ లో జరిగే ప్రదాని మోదీ సభకు ప్రతి ఒక్కరూ తరలిరండి- బీజేపీ దమ్మేందో చూపిద్దాం- అండగా ఉన్న జాతీయ నాయకత్వానికి, లీగల్ టీం, కార్యకర్తలకు ధన్యవాదాలు-వేం సిద్ధాంతాల కోసం పనిచేసే వాళ్లం- తెలంగాణలో కాషాయ జెండాను రెపరెపలాడిస్తాం- సింగరేణిలో సమ్మె చేస్తామన్న కేసీఆర్ సర్కార్ కు దమ్ముందా?- సింగరేణిలో 51 శాతం వాటా రాష్ట్రానిదే- 49 శాతం వాటా ఉన్న కేంద్రం ప్రైవేటీకరణ ఎలా చేయగలదు?- సింగరేణిని ప్రైవేటీకరణను బీజేపీ పక్షాన వ్యతిరేకిస్తాం- సింగరేణి కేసీఆర్ కుటుంబానికి ఏటీఎంలా మారింది- ఏడాదికోసారి కేసీ ఆర్ కుటుంబం వాటాలు పంచుకుంటుంది- మోదీ వస్తున్నారని తెలిసి రెచ్చగొట్టేందుకే కేసీఆర్ కుట్రలు- సింగరేణి కార్మికులందరికీ అన్ని విషయాలు తెలుసునన్నారు.

# సమస్యల వలయంలో బీబీనగర్ ఎయిమ్స్

హైదరాబాద్, ఏప్రిల్ 7: డాక్టర్ కావాలని కోరుకునే ప్రతి ఒక్కరు ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)లో సీటు సాధించాలని కలలు కంటారు. ఎయిమ్స్‌లో సీటు సాధిస్తే వైద్య విద్యార్థికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించినట్లే. అలాంటిది పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా తయారైంది తెలంగాణలోని బీబీనగర్ ఎయిమ్స్ పరిస్థితి. కేంద్ర ప్రభుత్వ వివక్ష కారణంగా వైద్య విద్యార్థులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు.




కనీస వసతులు కూడా లేకపోవడంతో ఇక్కడ సూపర్ స్పెషాలిటీ సేవలు కాదు కదా రోగులకు పీహెచ్‌సీ స్థాయి వైద్య చికిత్సలు కూడా అందడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. నామమాత్రంగా ఓపీ నడుస్తుండటంతో 3 ఏళ్ల నుంచి ఇన్ పేషెంట్లుగా అడ్మిట్ చేసుకోలేని పరిస్థితి ఉంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం వైద్య విద్యార్థులకు క్లినికల్ ప్రాక్టీస్‌ను సమీపంలోని భువనగిరి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసింది. దేశ రాజధాని ఢిల్లీలో ఉన్న విధంగా ప్రతి రాష్ట్రంలోనూ ఎయిమ్స్ నిర్మించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం దాదాపు ఐదేళ్ల క్రితం 201 ఎకరాల భూమిని 200 పడకలతో కూడిన ఆస్పత్రి భవనాన్ని ఎయిమ్స్‌కు అప్పగించింది. అప్పటి నుంచి నిర్మాణంలో ఉన్న భవనాల పనులు సైతం ఎక్కడివక్కడే నిలిచిపోయాయి.

బీబీనగర్ ఎయిమ్స్‌లో భవనాలు, విద్యార్థులు, సిబ్బంది మౌలిక వసతుల కోసం కేంద్ర ప్రభుత్వం రూ.1028 కోట్లు ఇవ్వాల్సి ఉండగా, అందులో ఇప్పటి వరకు కేవలం రూ.28 కోట్లు మాత్రమే విడుదల చేసిందని రాష్ట్ర ప్రభుత్వం ఆరోపిస్తున్నది. ఇక్కడ కనీసం బెడ్స్ కూడా లేకపోవడంతో ఇంతటి ప్రతిష్ఠాత్మక సంస్థలో సీటు పొందిన వైద్య విద్యార్థులు ఇక్కడ సీటు వద్దని గాంధీ మెడికల్ కాలేజీలో పరిస్థితులు ఏర్పడ్డాయి. ఫ్యాకల్టీకి సంబంధించి మొత్తం 183 పోస్టులు ఉండగా, వాటిలో కేవలం 92 మందినే నియమించారు. మిగతా 91 ఖాళీగానే ఉన్నాయంటే బీబీనగర్ ఎయిమ్స్ పరిస్థితి ఎంత దీనంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. బీబీనగర్ ఎయిమ్స్‌లో పూర్తి స్థాయిలో ఫ్యాకల్టీ లేని కారణంగా తరగతులు సరిగా జరగడం లేదని కేంద్ర ప్రభుత్వానికి ఎయిమ్స్ విద్యార్థులు ఫిర్యాదు చేసే వరకు పరిస్థితి వెళ్లింది.

ఇదిలా ఉండగా, బీబీనగర్ ఎయిమ్స్‌లో 2021లో శస్త్ర చికిత్సల విభాగం ప్రారంభమైంది. అప్పటి నుంచి కేవలం 294 శస్త్ర చికిత్సలు మాత్రమే జరిగినట్లు సమాచారం. సీనియర్ రెసిడెంట్లు పూర్తి స్థాయిలో లేకపోవడంతో శస్త్ర చికిత్సలతో పాటు వైద్య సేవలు కూడా అంతంత మాత్రంగానే అందు తున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం బీబీనగర్ ఎయిమ్స్ దుస్థితిని గమనించి పూర్తి స్థాయి సౌకర్యాలు కల్పించి వైద్య విద్యార్థులు, రోగులకు సరైన న్యాయం చేయాల్సిన అవసరం ఉంది.

# ఉద్యోగాలు జాతర - 9,231 ఉద్యోగాల భర్తీకి ట్రిబ్ నోటిఫికేషన్

హైదరాబాద్, ఏప్రిల్ 7: తెలంగాణలో ఉద్యోగాల జాతర కొనసాగుతోంది. ఈక్రమంలోనే విడతల వారీగా నోటిఫికేషన్లు విడుదలవుతున్నాయి. ఎప్పుడెప్పుడా అని లక్షలాది మంది ఉద్యోగార్థులు ఎదురుచూసిన గురుకుల టీచర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఇదే క్రమంలో భారీ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. రాష్ట్రంలోని గురుకులాల సొసైటీల్లో 9,231 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు విడుదలయ్యాయి. ఏకంగా ఒకేసారి 9 నోటిఫికేషన్లు విడుదల య్యాయి. ఈ మేరకు తెలంగాణ గురుకుల విద్యాలయాల సంస్థ రిక్రూట్‌మెంట్ బోర్డు (ట్రిబ్) నోటిఫికేషన్ జారీ చేసింది. మొత్తం ఖాళీల్లో డిగ్రీ లెక్చరర్ పీడీ, జూనియర్ లెక్చరర్, పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్(పీజీటీ), ట్రైయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్స్(టీజీటీ), పీడీ, లైబ్రేరియన్, ఫిజికల్ డైరెక్టర్స్ ఇన్ స్కూల్స్, డ్రాయింగ్ టీచర్స్ ఆర్ట్ టీచర్స్, క్రాఫ్ట్ ఇన్‌స్ట్రక్టర్, క్రాఫ్ట్ టీచర్స్, మ్యూజిక్ టీచర్స్ పోస్టులు ఉన్నాయి. అయితే ఈనెల 12వ తేదీ నుంచి అభ్యర్థులు తమ వివరాలను గురుకుల వెబ్‌సైట్‌లో ఓటీఆర్ చేసుకోవాల్సి ఉంటుంది.

అయితే ఈ పోస్టులకు సంబంధించి వేరువేరుగా మొత్తం 9 నోటిఫికేషన్లు విడుదల చేశారు. గురుకుల డిగ్రీ కళాశాలలో లెక్చరర్ పోస్టులు, ఫిజికల్ డైరెక్టర్లు, లైబ్రేరియన్ 868 పోస్టులకు సంబంధించిన మొదటి నోటిఫికేషన్‌కు ఈనెల 17 నుంచి మే 17 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. రెండో నోటిఫికేషన్‌లో గురుకుల జూనియర్ కాలేజీలోని 2008 పోస్టులకు ఈనెల 17 నుంచి మే 17 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. మూడో నోటిఫికేషన్‌లో పోస్టుగ్రాడ్యుయేట్ టీచర్ పీజీటీలో 1276 పోస్టులకు ఈనెల 24 నుంచి మే 24 వరకు దరఖాస్తులు, నాల్గో నోటిఫికేషన్‌లో గురుకుల స్కూల్స్ లైబ్రేరియన్ 434 పోస్టులకు ఈనెల 24 నుంచి మే 24 వరకు, ఐదో నోటిఫికేషన్‌లో ఫిజికల్ డైరెక్టర్ 275 పోస్టులకు సంబంధించిన ఉద్యోగాలకు ఈనెల 24 నుంచి మే 24 వరకు దరఖాస్తులు స్వీకరించ నున్నారు. ఆరో నోటిఫికేషన్‌లో గురుకుల డ్రాయింగ్ ఆర్ట్ 134 పోస్టులకు ఈనెల 24 నుంచి మే 24 వరకు, ఏడో నోటిఫికేషన్‌లో గురుకుల క్రాఫ్ట్ టీచర్ 92 పోస్టులకు, ఎనిమిదో నోటిఫికేషన్‌లో గురుకుల స్కూల్స్ మ్యూజిక్ టీచర్ల 124 పోస్టులకు కలిపి ఈనెల 24 నుంచి మే 24 వరకు దరఖాస్తులు ప్రక్రియ కొనసాగనుంది. అలాగే తొమ్మిదో నోటిఫికేషన్‌లో ట్రెయిన్డ్ గ్యాడ్యుయేట్ టీచర్ టీజీటీ 4020 పోస్టులకు ఈనెల 28 నుంచి మే 27వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. అయితే జోనల్ వారీగా పోస్టులు, అర్హతలు, పరీక్ష తేదీలు ఈనెల 17, 24, 28వ తేదీల్లో వెలువడే ఆయా విభాగాల నోటిఫికేషన్స్‌లో పేర్కొననున్నారు.

### గురుకులాల్లో ఇది మూడో నోటిఫికేషన్?.

తెలంగాణ ఏర్పాటు తర్వాత గురుకులాల్లో ఇది మూడో నోటిఫికేషన్ 2016లో 12 వేల గురుకుల పోస్టులకు టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ పోస్టులను ప్రిలిమ్స్-1 పేపర్, మెయిన్స్-2 పేపర్ విధానంలో పరీక్షలు నిర్వహించారు. రెండోసారి 2018లో గురుకుల బోర్డు ద్వారా 4వేల పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేశారు. ఇందులో ప్రిలిమ్స్, మెయిన్స్ కాకుండా మూడు పేపర్లతో? పరీక్షలు నిర్వహించారు. టీజీటీ పోస్టులకు దరఖాస్తు చేసుకునేవారు టెట్ పేపర్-2లో ఉత్తీర్ణత సాధించి వుండాలి.

### వారం రోజుల్లో మరో 1000 పోస్టులతో నోటిఫికేషన్?

మొత్తం 13,675 పోస్టుల్లో గ్రూప్-3, గ్రూప్-4 పోస్టుల మినహా మిగతా 10,675 పోస్టుల భర్తీని ట్రిబ్ ద్వారా చేపట్టనున్నాయి. అం దులో తొలివిడతగా ప్రస్తుతం 9231 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశారు. మిగిలిన మరో వెయ్యి పస్టులకు సంబంధించి వారం పది రోజుల్లో నోటిఫికేషన్ వెలువడనుంది.

అయితే ఈ పోస్టులకు సంబంధించి అందులో కొన్ని కొత్తగా, మెస్ ఇన్‌చార్జి, మరికొన్ని పోస్టులకు సర్వీస్ నిబంధనలు రూపొందించాల్సి ఉంది. అంతేకాకుండా న్యాయపరమైన చిక్కులు ఉన్నాయి. వీటన్నింటినీ పరిష్కరించిన తర్వాత దాదాపు మరో వారం రోజుల్లో మిగిలిన పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసేందుకు కసరత్తులు చేస్తున్నారు. గురుకులాల్లోని ఏఎన్ఎం, స్టాఫ్ నర్స్ పోస్టులను మెడికల్ బోర్డు చేపట్టనుంది.

### గురుకుల విద్యపై ప్రత్యేక దృష్టి?.

రాష్ట్ర సర్కారు గురుకుల విద్యపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ క్రమంలోనే రాష్ట్ర ఏర్పాటు నాటికి 123 గుకులాలు ఉండగా, వాటిని 1011లకు పెంచింది. అంతేకాకుండా పాఠశాల స్థాయి నుంచి ఇంటర్, డిగ్రీ స్థాయికి అప్‌గ్రేడ్ చేసింది.

ఈ క్రమంలోనే పోస్టులను దశలవారీగా భర్తీ చేసుకుంటూ పోతోంది. మూడేళ్ల క్రితమే ఆయా గురుకులాల్లో 10వేల పోస్టులను భర్తీ చేసింది. ఈసారి 9,231 పోస్టులను భర్తీ చేయనుంది.

తొలుత 9,096 పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అయితే మరో 33 బీసీ గురుకులాలు, 15 డిగ్రీ కాలేజీలను ప్రభుత్వం మంజూరు చేయగా అందుకనుగుణంగా పోస్టులను కూడా భర్తీ చేయాలని భావించింది. దీంతో మరో 3 వేల పోస్టులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈక్రమంలో మొత్తంగా బోధన, బోధనేతర పోస్టులు 13,530 ఖాళీలుగా గుర్తించింది. ఈక్రమంలోనే ముందస్తుగా 9231 పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేసి తర్వాత మరికొన్ని నోటిఫికేషన్లు జారీ చేయనుంది. ప్రభుత్వం భారీగా నోటిఫికేషన్ వేయడంతో ఉద్యోగార్థులు హర్షం వ్యక్తం చేశారు.

# ఐఏఎస్‌ల బదిలీల వెనుక వైఎస్ జగన్ వ్యూహం ఏమిటి ?

అమరావతి ఏప్రిల్ 7 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);ఏపీలో 8 జిల్లాల కలెక్టర్లు సహా 56 మందికి స్థానచలనం కలిగిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి గురువారం అర్ధరాత్రి ఉత్తర్వులు (జీవో 635) జారీ చేసిన విషయం తెలిసిందే. మరో ఏడాదిలో రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగంలో కీలకమైన కలెక్టర్, జాయింట్ కలెక్టర్లను భారీగా మార్చడంతో ప్రాధాన్యత సంతరించుకుంది. ఏపీలో ఎన్నికల సీజన్ అప్పుడే మొదలైందా.. మరోసారి అధికారం చేజిక్కించుకునేందుకు సీఎం వైఎస్ జగన్ అస్త్రశస్త్రాలు రెడీ చేస్తున్నారా.. ఏడాది ముందుగానే ఇందు కోసం అన్నీ సమకూర్చుకుంటున్నారా.. ఈ మధ్య వరుసగా మంత్రివర్గ సమావేశాలు, ఏప్రిల్-3న జరిగిన ఎమ్మెల్యేలతో సమావేశం కార్యక్రమం దేనికి సంకేతాలు.. ఇవన్నీ ఒక ఎత్తయితే.. ఊహించని రీతిలో 10 కాదు 20 కాదు ఏకంగా 56 మంది ఐఏఎస్‌లను బదిలీ చేయడం వెనుక ఆంతర్యమేంటి.. పక్కా వ్యూహంతోనే జగన్ ఇవన్నీ చేస్తున్నారా.. ఏపీలో జరుగుతున్న తాజా పరిణామాలను కాస్త గమనిస్తే అక్షరాలా నిజమే అనిపిస్తోంది. ఇంతకీ సడన్‌గా ఇంతమంది ఐఏఎస్‌ల బదిలీ వెనుక ఆంతర్యమేంటి.. బదిలీ చేయాల్సిందేనని జగన్‌ను పట్టుబట్టిందెవరు.. ఏరికోరి మరీ నియామకాలు ఎందుకుచేశారు.. ముందుగానే లీకులు చేయడం వెనుక మర్మమేంటి..

సరిగ్గా ఈ టైమ్‌లోనే జగన్ ఎందుకు మార్పులు, చేర్పులు చేయాల్సి వచ్చిందనే విషయం ఇప్పుడు సామాన్యుడిలో సైతం మెదులుతున్న మిలియన్ డాలర్ల ప్రశ్న. ఇటు సోషల్ మీడియాలోనూ ఎవరికి తోచినట్లుగా వారు ఓ రేంజ్‌లో ప్రశ్నలు, కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. ఇంకొందరైతే ఎన్నికల ముందే ఇవన్నీ మామూలే ఎవరైతే అనుకూలంగా ఉంటారో వారిని తెచ్చుకోవడం, నమ్మకస్తులను వారికి కావాల్సిన చోటికి బదిలీ చేసేయడం కామన్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఇదంతా జగన్ పక్కా వ్యూహంతోనే చేసుకుంటూ ముందుకెళ్తున్నారని పక్కాగా అర్థమవుతోంది. ఇప్పట్నుంచే ఆయా జిల్లాలపై కలెక్టర్లు పట్టు పెంచుకుంటే ఎన్నికల టైమ్‌కు అన్నీ సెట్ చేసుకోవచ్చున్నది జగన్ మనసులో ఉందట. అందుకే ఇప్పటికే ఒకట్రెండుసార్లు వాయిదా పడిన ఈ బదిలీల అంశాన్ని ఏప్రిల్-6 నాడు జగన్ కానిచ్చేశారట. అంతేకాదు.. ఈ బదిలీ అయిన వారిలో కొందరు చెప్పిన మాటలు వినట్లేదని.. ప్రభుత్వాన్ని ధిక్కరిస్తున్నారని ఇంకొందర్ని.. మరికొందరిని కావాల్సిన చోటుకు బదిలి చేసేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఈ బదిలీల వెనుక చాలానే జరిగాయని ఏపీ రాజకీయాల్లో తెగ చర్చ నడుస్తోంది. జగన్ ఏం చేసినా అందులో ఐప్యాక్ హస్తం ఉంటుందన్నది ప్రధాన ఆరోపణ. ఐప్యాక్ టీమ్ ఏం చెప్పినా.. చెప్పింది చెప్పినట్లుగానే సీఎం జగన్ అమలు చేస్తున్నారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఇవన్నీ ఒక ఎత్తయితే.. చాలా రోజులుగా ఏపీలోని కొందరు కలెక్టర్లకు, వైసీపీ ఎమ్మెల్యేలకు పడట్లేదన్నది జగమెరిగిన సత్యమే. పలు సందర్భాల్లో ఈ వ్యవహారాలన్నీ బయటికొచ్చాయి. రానున్న ఎన్నికల్లో ఆ అధికారులే ఉంటే తమకు ఇబ్బందులు తప్పవని.. కచ్చితంగా మార్చి తీరాల్సిందేనని కొందరు ఎమ్మెల్యేలు.. జగన్‌ను పట్టుబట్టారట. మరికొందరు ఎమ్మెల్యేలు అయితే జగన్‌కు పదే పదే ఫిర్యాదులు కూడా చేశారట. ఏప్రిల్-3న జరిగిన ఎమ్మెల్యేల సమావేశంలో మరోసారి ఈ విషయాలన్నీ జగన్ దృష్టికి ప్రజాప్రతినిధులు తీసుకెళ్లారట. దీంతో ఎమ్మెల్యేల టార్చర్ తట్టుకోలేక ఫైనల్‌గా ఇలా 56 మంది ఐఏఎస్‌లను బదిలీ చేయాల్సి వచ్చిందట. అంతేకాదు త్వరలోనే భారీగా ఎస్పీలు బదిలీ అవుతారని కూడా టాక్ నడుస్తోంది. పలువురు ఎస్పీలపైన కూడా ఇదివరకే జగన్‌కు భారీగానే ఫిర్యాదులు వచ్చాయట.

# బీజేపీలో చేరిన నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి

న్యూ ఢిల్లీ ఏప్రిల్ 7 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చివరి సీఎం నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి నేడు బీజేపీలో చేరారు. కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు లక్ష్మణ్ సమక్షంలో బీజేపీలో ఆయన బీజేపీ కండువా కప్పుకున్నారు. కిరణ్ కుమార్ రెడ్డికి పార్టీ సభ్యత్వాన్ని అరుణ్ సింగ్ అందించారు. కిరణ్ కుమార్ రెడ్డికి కండువా కప్పి కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి పార్టీలోకి ఆహ్వానించారు. కిరణ్‌కుమార్‌రెడ్డి చేరికతో ఏపీలో బీజేపీ బలోపేతం అవుతుందని ఈ సందర్భంగా ప్రహ్లాద్ జోషి పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా, స్పీకర్‌గా, సీఎంగా కిరణ్ సేవలందించారన్నారు. కాంగ్రెస్‌లో ఆయన ఇన్నింగ్స్ ముగిసిందని.. బీజేపీలో చేరి కొత్త ఇన్నింగ్స్ ప్రారంభిస్తున్నారని ప్రహ్లాద్ జోషి పేర్కొన్నారు. అవినీతికి వ్యతిరేకంగా ప్రధాని చేసున్న కృషి కిరణ్ కుమార్ రెడ్డిని ఆకర్షించిందన్నారు. ప్రధాని నేతృత్వంలో పనిచేయాలని భావిస్తున్నట్లు కొన్ని నెలల ముందు తనకు తెలిపారని ప్రహ్లాద్ జోషి పేర్కొన్నారు. కిరణ్ కుమార్ రెడ్డి కి క్లీన్ ఇమేజ్ ఉందన్నారు.

ఇక కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్‌కు రాజీనామా చేస్తానని తానెప్పుడూ అనుకోలేదన్నారు. తప్పుడు నిర్ణయాల వల్లే కాంగ్రెస్.. ఒక్కో రాష్ట్రంలో అధికారం కోల్పోతోందన్నారు. విభజన తర్వాత ఏపీలో కాంగ్రెస్ చెల్లాచెదురైందన్నారు. విభజనపై కాంగ్రెస్ ఎవరినీ సంప్రదించకుండా నిర్ణయం తీసుకుందన్నారు. నాయకత్వ లేమితో కాంగ్రెస్ ఇబ్బందులు పడుతోందన్నారు. బీజేపీ ఎదుగుతున్నా కొద్దీ కాంగ్రెస్ దిగజారుకుంటూ వచ్చిందన్నారు. 1980లో 7.7శాతం ఉన్న బీజేపీ ఓటింగ్..2019లో 37 శాతానికి పైగా పెరిగిందని కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. తమది 1952 నుంచి కాంగ్రెస్ కుటుంబమన్నారు. అయితే ఓటమి నుంచి కాంగ్రెస్ గుణపాఠాలు నేర్చుకోలేదన్నారు. కాంగ్రెస్ హైకమాండ్‌కు అధికారం మాత్రమే కావాలన్నారు. కాంగ్రెస్‌లో ట్రబుల్ షూటర్స్ లేకుండా పోయారన్నారు. దేశాన్ని వృద్ధి చేయాలన్నది బీజేపీ లక్ష్యం బీజేపీయేనన్నారు. గెలవాలనే తపన, దూరదృష్టి బీజేపీలో మాత్రమే ఉందన్నారు. మోదీ, అమిత్‌షా డైరెక్షన్‌లో బీజేపీ దూసుకుపోతుందని కిరణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

గత కొంత కాలంగా ఆయన రాజకీయాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. తిరిగి ఆయన యాక్టివ్ పొలిటిక్స్‌లోకి రావాలని భావిస్తున్నారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్‌కు గుడ్ బై చెప్పి బీజేపీలో చేరారు. 2014లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజనను వ్యతిరేకిస్తూ కిరణ్ కుమార్ రెడ్డి కాంగ్రెస్‌కి గుడ్ బై చెప్పారు. ఆ తర్వాత సమైక్య ఆంధ్ర పార్టీ పెట్టారు. ఎందుకో కానీ ఆ పార్టీ అంతగా ఆదరణకు నోచుకోలేదు. దీంతో ఒక్క సీటు కూడా గెలవలేకపోయారు. ఆ తర్వాత మళ్లీ కాంగ్రెస్‌లో చేరినా ఎప్పుడూ కూడా యాక్టివ్ పార్ట్ అనేది తీసుకోలేదు. ఇప్పుడు రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఆయన బీజేపీలో చేరినట్టు తెలుస్తోంది. మరోవైపు రాయలసీమలో తమ పార్టీని బలోపేతం చేసుకునేందుకు బీజేపీ సైతం ఆయనకు ఆహ్వానం పలికింది.

# ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని న్యూఢిల్లీలో వాకథాన్

## కార్యక్రమాన్ని నిర్వహించిన కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ




న్యూఢిల్లీ, ఏప్రిల్ 7:ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఢిల్లీలో వాకథాన్ నిర్వహించింది. కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి డాక్టర్ భారతి ప్రవీణ్ పవార్ ఈ వాకథాన్ కు నేతృత్వం వహించారు.

అందరికీ ఆరోగ్యం అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ (ఎన్ సిడి)లను దూరంగా ఉంచడానికి మాత్రమే కాకుండా మానసిక ఆరోగ్యం పై సానుకూల ప్రభావాలను కలిగించే ఆరోగ్యకరమైన అలవాట్ల గురించి అవగాహన కల్పించడం ఈ వాకథాన్ ఉద్దేశం. విజయ్ చౌక్ నుంచి కర్తవ్య పథ్ మీదుగా ప్రారంభమైన ఈ వాక్ థాన్ ఇండియా గేట్ మీదుగా నిర్మాణ్ భవన్ కు చేరుకుంది. మెరుగైన ఆరోగ్యం కోసం నడక సాగిస్తున్న 350 మందికి పైగా ఔత్సాహికులు వాక్ థాన్ లో ఉత్సాహంగా పాల్గొన్నారు. రక్తపోటు, మధుమేహం, మానసిక అనారోగ్యం, క్యాన్సర్ వంటి జీవనశైలి సంబంధిత ఆరోగ్య సమస్యలు / వ్యాధులను నివారించడానికి, నియంత్రించడానికి ఆరోగ్యకరమైన చురుకైన జీవనాన్ని అవలంబించాలని వారు ప్రతిజ్ఞ చేశారు.

కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ ఒక ట్వీట్ లో, , ఆరోగ్యకరమైన భారతదేశం కోసం గౌరవ ప్రధాన మంత్రి దార్శనికత ను పునరుద్ఘాటించారు.

ఈ సందర్భంగా డాక్టర్ మన్సుఖ్ మాండవీయ మాట్లాడుతూ, వాక్ థాన్ లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. వసుధైక కుటుంబం భారతీయ తత్వంగా మిగిలిపోయిందని, ఇక్కడ మనం కేవలం వ్యక్తిగతంగా కాకుండా అందరి పురోగతి గురించి ఆలోచిస్తామని ఆయన అన్నారు. కోవిడ్ సంక్షోభ సమయంలో, భారతదేశం ఎటువంటి వాణిజ్య లాభాలను పరిగణనలోకి తీసుకోకుండా అవసరమైన దేశాలకు వ్యాక్సిన్లు, వైద్య సామాగ్రిని అందించినప్పుడు ఈ వసుధైక కుటుంబం తత్వం మరింత గుర్తింపు పొందిందని అన్నారు. ప్రతి వాటాదారునికి సహాయం చేయడంలో భారతదేశం ముందంజలో ఉందని, ఈ స్ఫూర్తితో, భారతదేశం తన పౌరులు, ప్రపంచ ఆరోగ్యం కోసం పనిచేస్తోందని అన్నారు.

దేశ అభివృద్ధిలో ఆరోగ్యం ప్రాముఖ్యతను వివరిస్తూ, "ప్రధాన మంత్రి నాయకత్వంలో, భారతదేశం ఆరోగ్యాన్ని అభివృద్ధితో అనుసంధానించింది" అనిడాక్టర్ మాండవీయ అన్నారు.

"ఆరోగ్యవంతులైన పౌరులు మాత్రమే ఆరోగ్యకరమైన సమాజాన్ని, అభివృద్ధి చెందిన దేశాన్ని సృష్టించగలరు. ఈ ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ లో, అభివృద్ధి చెందిన ,ఆరోగ్యకరమైన భారతదేశాన్ని సృష్టించడానికి అందరం కలిసి పనిచేయాలని నేను మిమ్మల్ని కోరుతున్నాను" అన్నారు.

కేంద్ర ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి డాక్టర్ భారతి ప్రవీణ్ పవార్ మాట్లాడుతూ, వాకథాన్, యోగా లేదా ఇతర వ్యాయామాలు ఏదైనా సరే, మన యువత ఉత్సాహంగా ఈ శారీరక ఆరోగ్య ప్రక్రియలను తమ జీవితంలో అలవరచుకుంటున్నారని పేర్కొన్నారు.

ఆరోగ్యవంతుడు తమ కుటుంబానికే కాకుండా సమాజానికి కూడా సానుకూలంగా దోహదం చేస్తాడనే వాస్తవం నుండి "అందరికీ ఆరోగ్యం" భావన ఉద్భవించిందని ఆమె అన్నారు. ప్రవర్తనా మార్పులు, శారీరకంగా చురుకైన జీవనశైలిని ప్రోత్సహించే ఆరోగ్యకరమైన భారతదేశం కోసం గౌరవ ప్రధాన మంత్రి నాయకత్వంలో దేశం బలమైన సంకల్పాన్ని తీసుకుందని ఆమె పేర్కొన్నారు.

ప్రపంచ ఆరోగ్య దినోత్సవం మంచి ఆరోగ్యం ప్రాముఖ్యత గురించి ప్రజల్లో అవగాహనను పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ సందేశాన్ని ఎప్పటికప్పుడు పునరుద్ఘాటిస్తున్న కేంద్ర ఆరోగ్య మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ, సైక్లింగ్ పట్ల ఆయన ఉత్సాహానికి గానూ "గ్రీన్ ఎంపి" గా పేరు పొందారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని అవలంబించమని ఆయన పౌరులను ప్రోత్సహిస్తున్నారు.

ప్రస్తుతం దేశంలోని మొత్తం మరణాలలో 63% కంటే ఎక్కువ ఎన్ సి డి లు ఉన్నాయని తెలిసిందే. పొగాకు వాడకం (ధూమపానం , ధూమపానం కానిది), మద్యపానం, పేలవమైన ఆహారపు అలవాట్లు, తగినంత శారీరక శ్రమ లేకపోవడం , వాయు కాలుష్యం వంటి ప్రధాన ప్రవర్తనా ప్రమాద కారకాలతో బలంగా సంబంధం కలిగి ఉన్నాయి.

ఎన్ సి డి ల అభివృద్ధికి ప్రధాన ప్రమాద కారకాలలో ఒకటి శారీరక నిష్క్రియాత్మకత. నేషనల్ ఎన్సీడీ మానిటరింగ్ సర్వే (ఎన్ఎన్ఎంఎస్) (2017-18) ప్రకారం, 41.3% మంది భారతీయులు శారీరకంగా నిష్క్రియాత్మకంగా ఉన్నారు. శారీరక శ్రమ గుండె జబ్బులు, రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్ వంటి ఎన్సిడిల ప్రమాదాన్ని తగ్గించడమే కాదు. మానసిక ఆరోగ్యంపై కూడా సానుకూల ప్రభావాలను చూపుతుంది, చిత్తవైకల్యం ప్రారంభాన్ని ఆలస్యం చేస్తుంది.ఎం ఒ హెచ్ ఎఫ్ డబ్ల్యూ జాయింట్ సెక్రటరీ విశాల్ చౌహాన్, డబ్ల్యూహెచ్ వో ఆగ్నేయాసియా రీజియన్ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ పూనమ్ ఖేత్రపాల్ సింగ్, డబ్ల్యూహెచ్ వో ప్రతినిధి డాక్టర్ రోడెరికో హెచ్ ఆఫ్రిన్, ఆరోగ్య మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారులు, సఫ్దర్ జంగ్ హాస్పిటల్, రామ్ మనోహర్ లోహియా (ఆర్ ఎంఎల్) హాస్పిటల్, లేడీ హార్డింజ్ మెడికల్ కాలేజ్ వంటి కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రుల వైద్యులు, నర్సులు, సిబ్బంది, విద్యార్థులు కూడా వాకథాన్ లో పాల్గొన్నారు.

# మోడీ హైదరాబాద్ పర్యటనలో బీసీ విధానం ప్రకటించాలి

### -బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్క వెంకట్ యాదవ్

హైదరాబాద్ ఏప్రిల్ 7 (ఎక్స్ ప్రెస్ న్యూస్);హైదరాబాదులో పీఎం మోడీ గారి పర్యటనలు భాగంగా బీసీ విధానం ప్రకటించాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్క వెంకట్ యాదవ్ డిమాండ్ చేసారు. కేంద్ర ప్రభుత్వం బీసీల మీద చిన్నచూపు చూస్తుందని, బీసీ ప్రధాని అని చెప్పుకుంటూ బిజెపి బీసీల ఓట్లు వేసుకుంటూ బానిసలుగా చేసుకుంటున్నారని విమర్శించారు. నూటికి 60 శాతం ఉన్న బీసీ కులాలకు స్వతంత్రం వచ్చి 75 సంవత్సరాలు గడుస్తున్న బీసీలు రాజకీయంగా ఉద్యోగ ఎలాంటి చట్టసభల్లో వారికి ప్రాతినిధ్యం లేదు ఇకనైనా భారతదేశం లో మొత్తం జనగణలో జరిపి కులాల జాబితా ఇవ్వాలని బిజెపి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. బీసీల శ్రామిక జీవుల కష్టంతోటి ఇయ్యాల ఈ దేశంలో లక్షల కోట్ల బడ్జెట్ రూపొందిస్తున్నారు రాబోయే పార్లమెంట్ సమస్యలను బీసీలకు రెండు లక్షల కోట్ల రూపాయలు కేటాయించాలని అన్నారు.

# ప్రజల శ్రేయస్సే కేసీఆర్ ధ్యేయం- స్పీకర్ పోచారం



నిజామాబాద్, ఏప్రిల్ 7: ప్రజల శ్రేయస్సే కేసీఆర్ ధ్యేయమని తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రుద్రూర్ మండల కేంద్రంలోని చెరువుకట్ట వద్ద రూ.20 లక్షలతో నూతనంగా నిర్మించబోయే పెద్దమ్మ తల్లి దేవాలయ నిర్మాణానికి, రూ. 15లక్షలతో నిర్మించబోయే ముదిరాజ్ సంఘం కాంపౌండ్ వాల్, కిచెన్ షెడ్డు నిర్మాణానికి శుక్రవారం స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి స్థానిక మండల ప్రజాప్రతినిధులతో కలిసి భూమిపూజ చేశారు

. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ బాన్సువాడ నియోజకవర్గంలోని దేవాలయాలకు నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. అదేవిదంగా నియోజకవర్గంలో నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మించి అందజేస్తున్నామన్నారు.

ఏ రాష్ట్రంలో లేని అభివృద్ధి, సంక్షేమ పథకాలు కేవలం తెలంగాణ రాష్ట్రంలో అమలు చేసిన ఘనత సీఎం కేసీఆర్ దేనని స్పీకర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ బాన్సువాడ నియోజకవర్గ ఇంచార్జ్ పోచారం సురేందర్ రెడ్డి, ఎంపీపీ అక్కపల్లి సుజాత నాగేందర్, జడ్పీటీసీ నారోజి గంగారం, వైస్ ఎంపీపీ నట్కరి సాయిలు, సొసైటీ చైర్మన్ బద్దం సంజీవ్ రెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ పత్తి రాము, మండల అధ్యక్షులు పత్తి లక్ష్మణ్, రైతు సమన్వయ కమిటీ అధ్యక్షులు తోట సంగయ్య, గ్రామ సర్పంచ్ ఇందూరి చంద్రశేఖర్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు అక్కపల్లి నాగేందర్, ముదిరాజ్ సంఘం సభ్యులు, బీఆర్ ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# నారాయణ మాటలు నమ్మితే నట్టేట మునిగినట్టే

### - వడ్రానపు మధు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

ఖమ్మం,ఏప్రిల్ 7: (నేటినిజం ప్రతినిధి): మధిర పట్టణంలో కార్పొరేట్ నారాయణ విద్యాసంస్థల పేరుతో విద్యార్థులను తల్లిదండ్రులను మోసం చేస్తూ మాయమాటలు చెబుతూ నారాయణ స్కూల్ యాజమాన్యం ఈ విద్యా సంవత్సరం మరో కొత్త నాటకంతో ప్రజల్లోకి వస్తుంది. విద్యార్థులు తల్లిదండ్రులు చాలా జాగ్రత్త వహించి తమ పిల్లల భవిష్యత్తుపై ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వడ్రణపు మధు విజ్ఞప్తి చేశారు.నారాయణ ఈ టెక్నో స్కూల్ పేరుతో,నారాయణ ఐఐటి,మెడికల్,

ఎన్టిఎస్సి,ఒలంపియాడ్,బెస్ట్ ఫౌండేషన్ స్కూల్ పేరుతో సంవత్సరాల తరబడి ప్రచారం చేసుకుంటూ స్కూల్ యాజమాన్యానికి భువనగిరి నారాయణకి మధ్య వివాదం వచ్చినప్పుడు ప్రతిసారి స్కూల్ నుండి విద్యార్థులను బయటకు పంపి స్కూలుకు తాళాలు వేసిన సంగతి మధిర ప్రజలకు తెలుసునని,పిల్లల ప్రాణాలతో చెలగాటం ఆడుతూ అనుమతి లేని బస్సులు నడుపుతూ ఆర్టీవో చేత పరిష్మెంట్ తీసుకున్న విషయం మధిర ప్రజలకు తెలుసునని,ప్రతి సంవత్సరం బోధన సిబ్బందిని మార్చడం బోధనలో నాణ్యతలేదని తెలియజేస్తుందని అన్నారు,అధ్వానంగా స్కూల్ పరిసరాలు ఉన్నాయన్నారు.నారాయణ విద్యాసంస్థలు చదివిన విద్యార్థులు తమ చదివిన సర్టిఫికెట్స్ కోసం నరకయాతన పడ్డారని విద్యాసంస్థ చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగిన తల్లిదండ్రులు చేసేదేమీ లేక విద్యార్థి సంఘాల్ని పోలీస్ స్టేషన్ ని ఆశ్రయించిన విషయం తల్లిదండ్రులు గుర్తుంచుకోవాలని అన్నారు.

నిరంతరం సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న నారాయణ స్కూల్లో చేర్పించి తమ పిల్లల విలువైన భవిష్యత్తును ప్రమాదంలో పడవేయొద్దని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.తప్పుడు ప్రచారాలతో కరపత్రాలను పోస్టర్లను బ్రోచర్లను తయారుచేసి ప్రచారం నిర్వహిస్తున్న విద్యా సంస్థలపై విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.తప్పుడు ప్రచారాలు మాను కోకుండా ఉంటే ప్రత్యక్ష ఆందోళనకు ఎస్ఎఫ్ఐ సిద్ధమవుతుందని వడ్రానపు మధు తెలిజేశారు.

# ప్రపంచ ఆరోగ్య దినోత్సవం నేపథ్యంలో ఆరోగ్యకర భూగోళం కోసం కృషి చేస్తున్నవారికి ప్రధానమంత్రి కృతజ్ఞతలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7:పపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మన భూగోళాన్ని ఆరోగ్యకరంగా తీర్చిదిద్దడానికి కృషిచేస్తున్న వారందరికీ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ కృతజ్ఞతలు తెలిపారు.

ఈ మేరకు కేంద్ర ఆరోగ్య-కుటుంబ సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ ట్వీట్‌ను ప్రజలతో పంచుకుంటూ పంపిన సందేశంలో:

"మన భూగోళాన్ని ఆరోగ్యకరంగా మార్చేందుకు కృషి చేస్తున్నవారందరికీ ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మా కృతజ్ఞతలు. ఇందులో భాగంగా ఆరోగ్య మౌలిక సదుపాయాల పెంపుతోపాటు ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ సేవలు అందించడానికి మా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుంది" అని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

# దిబ్రూఘర్‌లో జరిగిన యోగా మహోత్సవ్‌లో పాల్గొన్న వేలాది మంది ప్రజలు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 7:అంతర్జాతీయ యోగా దినోత్సవం 2023 నిర్వహణకు సన్నాహక కార్యక్రమంగా దిబ్రూఘర్‌లో నిర్వహించిన యోగా మహోత్సవ్ విజయవంతంగా జరిగింది. కార్యక్రమంలో వేలాది మంది పాల్గొని యోగాసనాలు వేశారు. దిబ్రూఘర్ విశ్వవిద్యాలయంలో సామూహిక యోగా కార్యక్రమం జరిగింది.

కార్యక్రమంలో కేంద్ర ఆయుష్, ఓడ రేవులు, నౌక రవాణా, జలమార్గాల శాఖ మంత్రి శ్రీ సర్బానంద సోనోవాల్, త్రిపుర ముఖ్యమంత్రి ప్రొఫెసర్ (డా) మాణిక్ సాహా, అరుణాచల్ ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి చౌనా మెయిన్, దిబ్రూఘర్ పార్లమెంట్ సభ్యుడు, కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ సహాయ మంత్రి శ్రీ రామేశ్వర్ తెలీ,కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి రాజ్‌కుమార్ రంజన్ సింగ్, అస్సాం ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రి కేశబ్ మహంత, మాజీ మంత్రి హౌసెఫెడ్ చైర్మన్ శ్రీ భబేష్ కలిత, మణిపూర్ ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రి డాక్టర్ సనమ్ రంజన్ సింగ్, దిబ్రూఘర్ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ జితేన్ హజారికా, ఆయుష్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ వైద్య రాజేష్ కోటచా పాల్గొన్నారు.

సహజ అందాలకు నిలయమైన దిబ్రూఘర్‌లో యోగా మహోత్సవం నిర్వహించడం పట్ల శ్రీ సర్బానంద సోనోవాల్ హర్షం వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ప్రచారం కల్పించి ఆరోగ్యం సంరక్షణ కోసం అన్ని దేశాల ప్రజలు యోగా ఆచరించేలా చూడాలన్న ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆశయాలకు అనుగుణంగా నిర్వహించిన కార్యక్రమంలో వేలాది మంది పాల్గొని విజయవంతం చేశారు అని మంత్రి అన్నారు.

ప్రపంచ ఆరోగ్య దినోత్సవం రోజున యోగా మహోత్సవం నిర్వహించామని శ్రీ సర్బానంద సోనోవాల్ అన్నారు. దిబ్రూగఢ్‌లో 100 పడకల యోగా, నేచురోపతి ఆసుపత్రి నిర్మిస్తామని కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్ ప్రకటించారు. ఆస్పత్రి నిర్మాణంతో ప్రాంతంలో మెరుగైన ఆరోగ్య సంరక్షణ చర్యలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయని మంత్రి అన్నారు. ఈశాన్య భారతదేశంలో తొలిసారిగా చేపట్టిన నిర్మాణ కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించిన అస్సాం ముఖ్యమంత్రి శ్రీ హిమంత బిస్వ శర్మకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కేంద్రం అస్సాం ప్రజలకు యోగా, నేచురోపతి ఔట్ పేషెంట్, ఇన్‌పేషెంట్ చికిత్సలను అందించడం ద్వారా ప్రాంత ఆరోగ్య అవసరాలను తీరుస్తుందన్నారు.

యోగా అభ్యాసకులకు అవసరమైన సౌకర్యాలు అభివృద్ధి చేయడానికి మొరార్జీ దేశాయ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యోగా (ఓఐఓఎజ), దిబ్రూఘర్ విశ్వవిద్యాలయం మధ్య ఒక అవగాహన ఒప్పందం కూడా కుదిరింది. యోగాను ప్రతి ఒక్కరి ఆరోగ్యకరమైన జీవనశైలి లో భాగం చేయడానికి జరుగుతున్న ప్రయత్నాలలో భాగంగా రెండు సంస్థలు అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి.

అరుణాచల్ ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి చౌనా మెయిన్ మాట్లాడుతూ యోగాని భారతదేశం గొప్ప వారసత్వ సంపదగా వర్ణించారు. యోగా చేయడం ద్వారా ప్రజల ఆరోగ్యం మెరుగు పడుతుందని అన్నారు. యోగా ఆరోగ్యకర భవిష్యత్తు అందిస్తుందన్నారు. ప్రపంచానికి భారతదేశం అందించిన విలువైన బహుమతి యోగ అని ఆయన అన్నారు.

అస్సాం పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి శ్రీ బిమల్ బోరహ, అరుణాచల్ ప్రదేశ్ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ లో లిబాంగ్, మేఘాలయ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మాజీలు అంపరీన్ లిజ్గం దోహ, సిక్కిం పట్టణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ ఎల్.బి.దాస్, అస్సాం కార్మిక సంక్షేమ శాఖ మంత్రి శ్రీ సంజయ్ కిషన్, దిబ్రూఘర్ శాసనసభ్యుడు ప్రశాంత్ ఫుకాన్, ఎంపీ హోరెన్ సింగ్ బే, శాసనసభ్యులు తేరోస్ గోవాలా, బినోద్ హజారికా, చక్ర గొగోయ్ సహ పలువురు ప్రముఖులు యోగా మహోత్సవ్‌కు హాజరయ్యారు.

వేలాది మంది భారతీయ విద్యార్థులు, టాంజానియా, ఉగాండా, కెన్యా, టోగో, నేపాల్, నైజీరియా, లెసోతో, బోట్స్వానా, ఈజిప్ట్, నమీబియా, కొరియా దేశాలకు చెందిన అంతర్జాతీయ విద్యార్థులు, యోగా ప్రియులు యోగా మహోత్సవ్‌లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో,మొరార్జీ దేశాయ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యోగా డైరెక్టర్ డాక్టర్ ఈశ్వర్ వి. బసవరెడ్డి యోగా ప్రదర్శనలపై మార్గనిర్దేశం చేశారు.

# దేశీయ గ్యాస్ ధరల మార్గదర్శకాల సవరణకు మంత్రిమండలి నిర్ణయంపై ప్రధాని అభినందన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7:అంతర్జాతీయ గ్యాస్ ధరల పెరుగుదల నుంచి భారత వినియోగదారుల ప్రయోజనాల పరిరక్షణ దిశగా దేశీయ గ్యాస్ ధరలపై ప్రభావం పడకుండా సవరణను ఆమోదిస్తూ మంత్రిమండలి నిర్ణయం తీసుకోవడాన్ని ప్రధానమంత్రి ప్రశంసించారు.

దీనిపై కేంద్ర పెట్రోలియం-సహజ వాయువు శాఖ మంత్రి శ్రీ హర్దీప్ సింగ్ పూరి ట్వీట్‌ను ప్రజలతో పంచుకుంటూ పంపిన సందేశంలో:

"సవరించిన దేశీయ గ్యాస్ ధరలకు సంబంధించి మంత్రిమండలి నిర్ణయం వినియోగదారులకు అనేక ప్రయోజనాలు కల్పిస్తుంది. దీన్ని ఈ రంగానికి సానుకూల పరిణామంగా పరిగణించాలి" అని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

# ముస్లింల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి : మంత్రి కొప్పుల ఈశ్వర్



ధర్మపురి, ఏప్రిల్ 7: ముస్లింల సంక్షేమంపై ప్రత్యేక దష్టి సారించి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేసిందని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా ప్రభుత్వ పక్షాన ఇచ్చే ఇఫ్తార్‌విందు ఏర్పాటపై నియోజకవర్గ ముస్లిం నాయకులతో శుక్రవారం కరీంనగర్ క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింలు నెల రోజుల పాటు ఎంతో దీక్ష, భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్ష చేయడం అభినందనీయమని అన్నారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం రంజాన్ పర్వదినాన్ని ఘనంగా నిర్వహిస్తున్న విషయం తెలిసిందేనని పేర్కొన్నారు. రంజాన్ పండుగకు పేదలకు దుస్తుల పంపిణీ వంటి వినూత్న కార్యక్రమాలు చేపడుతుందని వెల్లడించారు. కేసీఆర్ నేతృత్వంలో గడిచిన 9 ఏళ్ల కాలంలో ఈద్గాలు, మసీదుల అభివృద్ధికి చేపట్టిన చర్యలను వివరించారు. ఉపవాస దీక్షలో పాల్గొనే ప్రభుత్వ ఉద్యోగులకు ఎటువంటి అవాంతరాలు ఎదురు కాకుండా ప్రత్యేక వెసులుబాటు కల్పించిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని కొనియాడారు.ఉపవాస దీక్షలు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకొని మత సామరస్యాన్ని ప్రతిభింబించేలా రంజాన్ పర్వదినాన్ని జరుపుకోవాలని మంత్రి ఆకాంక్షించారు. ఈ సమావేశంలో జడ్పీ కోఆప్షన్ సభ్యులు అమ్జాద్, ధర్మపురి మున్సిపల్ కౌన్సిలర్ యూనుస్, కోఆప్షన్ సభ్యులు అలీమ్, షబ్బీర్, మండల కోఆప్షన్ సభ్యులు కైసర్, అబ్దుల్ రహమాన్, ఎండి రియాజ్, జిల్లా వక్ఫ్ ప్రొటెక్షన్ సభ్యుడు ఆసిఫ్, తదితరులున్నారు.

# అవతార్ మెహర్ బాబా షష్టి పూర్తి ఉత్సవాలు

### -నేడు రేపు స్వర్ణభారతి కళ్యాణ మండపంలో వేడుకలు

### -ట్రస్ట్ చైర్మన్ ఆర్ రామచంద్రయ్య

ఖమ్మం,ఏప్రిల్ 7: (నేటినిజం ప్రతినిధి): అవతార్ మెహర్ బాబా షష్టిపూర్తి ఉత్సవాలు ఏప్రిల్ 8 9 తేదీలలో స్వర్ణ భారతి కమ్మవారి కళ్యాణమండపం,ఖమ్మం నందు జరుగుచున్నవని ప్రజలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అవతార్ మెహర దివ్య, ప్రేమాశీస్సులు పొందాలని అవతార్ మెహర బాబా ట్రస్టు చైర్మన్ ఆర్ రామచంద్రయ్య అన్నారు.శుక్రవారం స్థానిక ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ట్రస్ట్ చైర్మన్ ఆర్ రామచంద్రయ్య మాట్లాడుతూ... భగవంతునిగా, మానవునిగా, ఆధ్యాత్మిక సాధకునిగా, ప్రభువుగా, భగవత్సేవకునిగా, అవతారునిగా అనేక పాత్రలలో ఆయాజీవితములను ఆదర్శప్రాయంగా జీవించారు. భగవంతుడు మాత్రమే సత్యమనీ, ప్రతి మానవుడు భగవంతు డేనని, కానీ ప్రతిమానవుడు అనుభవ పూర్వకంగా భగవంతుడు కావలసి యున్నదనీ, అందుకు మానవరూపంలో నున్న భగవంతుని ప్రేమించుట ద్వా రా, మానవుడు భగవంతుడు కాగలడని, ప్రతి యుగంలోనూ అవతరిస్తూ వున్నది ఆ భగవంతుడే ననీ, అవతారుడు కూడ ఒకడేననీ, లోకానికి సత్య ప్రేమ సందేశాలను యిచ్చారన్నా రు.అవతారపురుషుడొక్కడే నన్న సత్యా న్ని ప్రపంచ మతాలన్నీ గ్రహించి- వర్తమాన యుగావతారుడైన మెహెర్ బాబాను ప్రేమిస్తున్నారన్నారు. మౌనంలోనే తన విశ్వ కార్యక్రమం ముగించుకొని 1969 జనవరి 31న మహానిర్యాణం పొందారన్నారు.ఈ ఉత్సవ కార్యక్రమమునకు జాతి, మత, కుల ప్రసక్తి లేకుండా దైవ ప్రేమికులందరూ పాల్గొని బ్రహ్మ, విష్ణు, శివుని అనుగ్రహం పొందిన అవతార్ మెహర్ బాబా దివ్య ప్రేమా శిష్యులు పొందా లని కోరారు. ఏప్రిల్ 8న ఉదయం 11:30 గంటలకు మహారాష్ట్ర, అహ్మద్ నగర్ కు చెందిన అవతార్ మెహర్ బాబా అంతర్జాతీయ ట్రస్ట్ చైర్మన్ ఫెరామ్ రోజ్ మిస్త్రీతో విలేకరుల సమావేశం ఉంటుందని తెలిపారు.ఈ విలేకరుల సమావేశంలో ట్రస్ట్ కోశాధి కారి బి. సీతారాం, ట్రస్ట్ కార్యదర్శి ఆర్.ఉమా దేవి, సభ్యులు వి.కోటేశ్వరావు, ఎల్.రవి, పి.జనార్దన్ పాల్గొన్నారు.

# 'యువ సంగం' రెండోదశకు నమోదు చేసుకోండి: యువతకు ప్రధానమంత్రి పిలుపు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7:యువ సంగం రెండోదశకు పేర్లు నమోదు చేసుకోవాల్సిందిగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ యువతకు పిలుపునిచ్చారు.

ఈ మేరకు కేంద్ర విద్యాశాఖ మంత్రి శ్రీ ధర్మేంద్ర ప్రధాన్ ట్వీట్‌ను యువతరంతో పంచుకుంటూ పంపిన సందేశంలో:

"యువ సంగం తొలిదశ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాల అద్భుత వీడియోలు, చిత్రాలను నేను చూశాను. ఒకే భారతం-శ్రేష్ఠ భారతం' స్ఫూర్తిని ఈ ఆదానప్రదానాలు మరింత బలోపేతం చేస్తాయి. ఈ మేరకు యువతరం రెండోదశలో పాల్గొనేందుకు పేర్లు నమోదు చేసుకోవాలి" అని ప్రధానమంత్రి సూచించారు.

# జగనన్నే మా భవిష్యత్ ప్రజల నినాదం.. మంత్రి సురేష్




అమరావతి, ఏప్రిల్ 7:జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ అనేవి ప్రజల నినాదమని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. ప్రకాశం జిల్లా యర్రగొండపాలెంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా యర్రగొండపాలెం పట్టణంలో ఇంటింటికి తిరిగి లబ్దిదారులతో మంత్రి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 5కోట్ల మంది ప్రజలను కలిసి, వారికి జరిగిన లబ్దిని తెలుసుకునే ప్రతిష్టాత్మక ప్రచార కార్యక్రమమన్నారు. అలాగే మంత్రి గుడ్ ఫ్రైడే సందర్భంగా జరుగుతున్న ప్రార్థనల్లో మంత్రి సురేష్ పాల్గొన్నారు.

